



పంచాయతీల్లోనూ సత్తా చాటాలి

- గ్రామస్థాయి ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దు
- కూటమి బలపరిచిన అభ్యర్థులే గెలవాలి
- కొందరు హింసనే నమ్ముకుంటారు... కూటమి ప్రజాస్వామ్యాన్ని నమ్ముతుంది
- ప్రజలకు మంచి చేయడానికే అధికారం
- వైసీపీ తప్పుడు ప్రచారాన్ని జనం నమ్మలేదు
- టెలీ కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు
- టీడీపీ ముఖ్యనేతలకు దిశానిర్దేశం


అమరావతి(చైతన్యరథం): పంచాయతీ ఎన్నికలల్లోనూ కూట మి బలపరిచిన అభ్యర్థులే గెలవాలని టీడీపీ అధినేత, ముఖ్యమం త్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పంచాయతీ ఎన్నికలపై పార్టీ ముఖ్యనేతలతో శనివారం రాత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలు చేశారు. పట్టణ, పరిషత్ ఎన్నికల్లో ప్రజలు చారిత్రక విజయాన్ని ఎన్డీఏకు ఇచ్చారు. 94 మున్సిపాలిటీల్లో, 3235 వార్డుల్లో ఎన్డీఏ అభ్యర్థులు గెలిచారు. 575 జడ్పీటీసీలు, 7,500 కు పైగా ఎంపీటీసీ స్థానాల్లో కూటమి నిలబెట్టిన అభ్యర్థులు విజ యం సాధించారు. ఈవీఎం, బ్యాలెట్, పోస్టల్ ఏ విధానమైనా కూటమిదే హవా. మరో 23 పట్టణ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు తిరుగులేని విజయం సాధించాలి. గ్రామాల్లోనూ కూటమి బలపర్చి న అభ్యర్థులే గెలవాలని స్పష్టం చేశారు. గొడవలకు పోవద్దు.. కొందరు హింసనే నమ్ముకుంటారు.. కూటమి ప్రజాస్వామ్యాన్ని నమ్ముతుంది. అధికారాన్ని మంచి చేయడానికి, ప్రజలకు దగ్గర కావడానికి ఉపయోగించుకోవాలి. గ్రామస్థాయి ఎన్నికలను నేత లు తేలిగ్గా తీసుకోవద్దని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో మంచి నాయకులను తీర్చిదిద్దుకోవడానికి ఈ ఎన్నికలు చక్కటి అవకాశమని తెలిపారు. గ్రామస్థాయి లోనూ కూటమి బలపరిచే అభ్యర్థుల్లో మంచి వారిని ఎంపిక చేయాలని సూచించారు. గెలిచిన ఎంపీటీసీ, జడ్పీటీసీలు యాక్టివ్‌గా ఉండి ప్రచారం నిర్వహించాలి. రాబోయే 30 ఏళ్లకు ఉపయోగపడేలా నాయకత్వాన్ని నిర్మించుకుందామని పిలుపు నిచ్చారు. కేంద్రం, రాష్ట్రం, మున్సిపాలిటీలు, జిల్లా పరిషత్‌లలో ఎన్డీఏనే ఉంది. పంచాయతీల్లో కూడా కూటమి బలపరిచిన అభ్యర్థులు గెలిస్తే అన్ని కార్యక్రమాలు సజావుగా ముందుకు సాగుతాయని తెలిపారు. గతం కంటే 25 శాతం ఓటుబ్యాంక్ కూటమికి పెరిగింది. ఉద్యోగులంతా కూట మి ప్రభుత్వం వైపే నిలబడ్డారు. వైసీపీ చేసిన చేసిన తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మలేదు. సుమారు 7 జిల్లాల్లో క్లీన్ స్వీప్ చేశాం. అనకాపల్లి, మార్కాపురం జిల్లాల ప్రజలు 100 శాతం స్ట్రైక్ రేట్ ఇచ్చారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి పోలవరం నీరు, మార్కాపురం జిల్లా ఏర్పాటు, వెలిగొండ ఫేజ్-1 ఫలాలు స్థానిక ఎన్నికల్లో ప్రతిబింబించాయని పేర్కొన్నారు.

పంచాయతీ పోరుకు నేటి నుంచే నామినేషన్లు

- తొలి దశలో 3967 సర్పంచులు, 40,012 వార్డు సభ్యుల స్థానాలు
- నవంబరు 26న పోలింగ్ ప్రక్రియ
- అదేరోజు కౌంటింగ్, ఫలితాలు

రాష్ట్రంలో తొలి దశ పంచాయతీ ఎన్నికలకు ఆదివారం నుంచి మూడురోజుల పాటు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించి అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 26న 3,967 సర్పంచులు, 40,012 వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. అదేరోజు మధ్యాహ్నం 2 గంటల తరువాత ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు.

- వివరాలు 2 లో..



సీనియర్ నటుడు గిరిబాబు మృతి

- తెలుగు సినీ రంగానికి తీరని లోటు
- సీఎం చంద్రబాబు, లోకేష్ సంతాపం

అమరావతి(చైతన్యరథం): సీనియర్ నటుడు గిరిబాబు(80) హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివా రం కన్ను మూశారు. ఆయన మృతికి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో ఓ సామాన్య వ్యవసా య కుటుంబంలో జన్మించిన గిరిబాబు ఐదు దశాబ్దాల సినీ ప్రస్థానంలో 600లకు పైగా చిత్రాల్లో నటించి ప్రేక్షకుల అభి మానాన్ని సంపాదించుకున్నారని గుర్తుచేశారు. కుటుంబసభ్యుల కు సానుభూతి ప్రకటించారు. గిరిబాబు మృతికి మంత్రి నారా లోకేష్ విచారం వ్యక్తం చేశారు. నటుడుగానే కాకుండా దర్శకుడు, నిర్మాతగానూ ప్రతిభ చాటుకున్నారని గుర్తు చేశారు. గిరిబాబు మరణం, తెలుగు సినీపరిశ్రమకు పూడ్చలేని లోటని పేర్కొన్నారు.

అభ్యర్థులు కోరితే నామినేషన్లకు ప్రత్యేక ఎస్కార్ట్

- పంచాయతీ ఎన్నికలకు అప్రమత్తం
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పునేఠా
- పంచాయతీలు, మున్సిపల్ ఎన్నికలపై 12 జిల్లాల ఎస్పీలతో సమావేశం

తిరుపతి(చైతన్యరథం): గ్రామ పంచాయతీ ఎన్నికలు, పెండిం గ్‌లో ఉన్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలపై ఎస్ఈసీ అనిల్‌చంద్ర పునేఠా శనివారం కీలక సమీక్ష నిర్వహించారు. తిరుపతి కలెక్టరేట్ లో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి 12 జిల్లాల పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఎన్నికల నేప థ్యంలో శాంతిభద్రతల నిర్వహణపై అధికారులతో చర్చించారు. అనంతరం మీడియాతో వివరాలు వెల్లడించారు.



సమస్యాత్మక 12 జిల్లాల ఎస్పీలతో ప్రత్యేకంగా మాట్లాడాం.. పంచాయతీ ఎన్నికల సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు చెప్పారు. నామినేషన్ల సమర్పణకు ఎవరైనా ప్రత్యేక ఎస్కార్ట్ కావా లని కోరితే కల్పిస్తామని తెలిపారు. దాడి ముప్పు ఉందని ఎస్పీకి తెలియజేసినట్లయితే అభ్యర్థులకు ప్రత్యేక భద్రత కల్పిస్తారని వివ రించారు. పంచాయతీరాజ్ శాఖలో నిన్న కొత్త జీవో జారీ అయిం ది. ఏకగ్రీవం అయిన గ్రామాలకు ప్రభుత్వం ప్రోత్సాహక నిధులు ఇస్తుందని చెప్పారు.

భారత్ అండర్ 19 క్రికెట్ జట్టుకు సీఎం చంద్రబాబు అభినందనలు



పురుషుల అండర్-19 ఆసియా కప్ ఫైనల్‌లో విజయం సాధించి ట్రోఫీ గెలిచిన భారత్ జట్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసల జల్లు కురిపించారు. ఎక్స్ వేదికగా జట్టుకు అభినందనలు తెలిపారు. పాకిస్థాన్‌పై చివరి బంతికి సంచలన విజయం సాధించడం చరిత్రాత్మక, అద్భుతమైన క్షణమని పేర్కొన్నారు. ఆసియా కప్ అండర్-19 ఫైనల్‌లో పాకిస్థాన్‌పై చివరి బంతికి టీమిండియా సంచలన విజయం సాధించిందని కొనియాడారు. చాంపియన్స్‌గా నిలిచిన భారత అండర్-19 జట్టు సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

అదృశ్యమైన పిల్లల ఆచూకీకి కమిటీలు

- రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఏర్పాటు
- కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం
- మానవ అక్రమ రవాణా నిరోధానికి చర్యలు
- జీవో 26 విడుదల చేస్తూ ఉత్తర్వులు



పంచాయతీ ఎన్నికలకు
నేటి నుంచే నామినేషన్ల పర్వం

- **తొలి దశలో 3967 సర్పంచులు, 40,012 వార్డు సభ్యుల స్థానాలు**
- **నవంబరు 26న పోలింగ్ ప్రక్రియ**
- **అదేరోజు కౌంటింగ్, ఫలితాలు**



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో తొలి దశ పంచాయతీ ఎన్నికలకు ఆదివారం నుంచే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారం భం కానుంది. ఇందుకు సంబంధించి అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 26న 3,967 సర్పంచులు, 40,012 వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. అదేరోజు మధ్యాహ్నం 2 గంటల తరువాత ఓట్లు లెక్కించి ఫలితా లు ప్రకటిస్తారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రంలో మొత్తం 13,167 సర్పంచులు, 1,32, 514 వార్డు సభ్యుల స్థానాలకు మూడు దశల్లో పోలింగ్ నిర్వహించ నున్నారు. రెండు, మూడు దశల ఎన్నికలకు ఈ నెల 16, 19 తేదీల్లో ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇవ్వనుంది. డిసెంబరు 2 నాటికి మూడు దశల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేస్తారు.

తొలి దశ ఆ రెండు జిల్లాలు దూరం

విశాఖపట్నం, గుంటూరు జిల్లాల్లో తొలి దశ పోలింగ్ నిర్వ హించడం లేదు. ఈ నెల 26న పంచాయతీలతో పాటే 23 పట్టణ స్థానిక సంస్థలకు పోలింగ్ నిర్వహించనున్నారు. వీటిలో గుంటూ రు జిల్లాలో మంగళగిరి – తాడేపల్లి నగరపాలక సంస్థతో పాటు పొన్నూరు పురపాలక సంఘం ఉన్నాయి. జిల్లా యంత్రాంగం ఆ రెండు చోట్ల పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. రెండు, మూడు దశల్లో జిల్లాలో 208 పంచాయతీలకు పోలింగ్ నిర్వహించనున్నారు. అలాగే విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు లో జిల్లా యంత్రాంగమంతా నిమగ్నమై ఉంది. దీంతో ఆ జిల్లాలో తొలి దశ పంచాయతీ ఎన్నికల పోలింగ్ నిర్వహించడం లేదు. ఈ జిల్లాలోని మొత్తం 79 పంచాయతీలకు మూడో దశలో పోలింగ్ నిర్వహించనున్నారు. తొలి దశ పోలింగ్‌లో తిరుపతి జిల్లాలో అత్యధికంగా 404 పంచాయతీలు ఉన్నాయి. అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 66 పంచాయతీలకు పోలింగ్ నిర్వహిస్తున్నారు.

మొదటి దశ షెడ్యూల్ వివరాలు

నవంబరు 15 : నామినేషన్ల స్వీకరణ ప్రారంభం
నవంబరు 17 : నామినేషన్ల స్వీకరణ ముగింపు
నవంబరు 18 : నామినేషన్ల పరిశీలన..తిరస్కరణ
నవంబరు 19 : తిరస్కరించిన నామినేషన్లపై సాయంత్రం 5 గంటల్లోపు ఆర్డీవోకు అప్పీల్ అవకాశం
నవంబరు 20 : అప్పీల్‌ను ఆర్డీవో పరిష్కరిస్తారు
నవంబరు 21 : మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు: ఆ తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ
నవంబరు 26 : ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్: మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు: ఫలితాల ప్రకటన తర్వాత రోజు ఉప సర్పంచి ఎన్నిక
నవంబరు 27 : అవసరమైన చోట రీ పోలింగ్, ఓట్ల లెక్కింపు ఫలితాల ప్రకటన

నోట్: *ఏదైనా పంచాయతీకి, పదవులకు ఎన్నికలు నిర్వహిం చొద్దని న్యాయస్థానం ఆదేశాలిస్తే.. అలాంటి చోట ఎన్నికలకు వెళ్లొద్దని కలెక్టర్లను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పునేఠా ఆదేశించారు.*

డిపాజిట్ వివరాలు...ఎన్నికల వ్యయ పరిమితి

- సర్పంచ్ స్థానాలకు నామినేషన్లు వేసే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ. 1500, ఇతరులైతే రూ. 3000 డిపాజిట్ చేయాలి.
- వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు వేసే ఎస్సీ, ఎస్టీ, బీసీలు రూ. 500, ఇతరులైతే రూ. 1,000 డిపాజిట్ చెల్లించాలి.
- 2011 జనాభా లెక్కల ప్రకారం 10 వేలు, అంతకంటే ఎక్కువ జనాభా కలిగిన పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థుల ఎన్నిక ల వ్యయం రూ. 4 లక్షలు, వార్డు సభ్యుల ఖర్చు రూ. లక్ష
- 10 వేల కంటే తక్కువ జనాభా గల పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థుల ఎన్నికల ఖర్చు రూ. 2.50 లక్షలు, వార్డు సభ్యులకు పరిమితి రూ. 60 వేలు

పంచాయతీల్లో మూడు దశల్లో ఓటర్లు

మొత్తం ఓటర్లు:	2,61,52,377
మొత్తం మహిళా ఓటర్లు:	1,32,74,208
మొత్తం పురుష ఓటర్లు:	1,28,76,887
ఇతర వర్గం ఓటర్లు:	1282

మొత్తం 13,167 సర్పంచుల స్థానాలకు రిజర్వేషన్లు

ఎస్టీ మహిళ	475
ఎస్టీ జనరల్	705
ఎస్సీ మహిళ	1135
ఎస్సీ జనరల్	1,331
బీసీ మహిళ	1,536
బీసీ జనరల్	1,569
మహిళ జనరల్	3,299
అన్ రిజర్వ్	3,117

ఎడమ చేతి చిటికెన వేలికి సిరా గుర్తు

ఈ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓటర్ల ఎడమ చేతి చిటికెన వేలికి సిరా గుర్తు వేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సృష్టం చేసింది. ఇటీవల నిర్వహించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో ఓటర్ల ఎడమ చేతి వేలికి, రీపోలింగ్ సమయంలో మధ్య వేలికి సిరా గుర్తులు వేశారు. ఇప్పుడు అదే ఓటర్లు గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. దాంతో ఇప్పటికీ కొందరి చేతి వేళ్లకు గుర్తులు తొలగని నేపథ్యంలో గందరగోళం తలెత్తకుండా ఎడమ చేతి చిటికెన వేలికి సిరా గుర్తు వేయాలని ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది.



బాలల అభ్యున్నతితోనే ప్రగతి

జాతీయ బాలల దినోత్సవాన సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు

అమరావతి(చైతన్యరథం): జాతీయ బాలల దినో త్సవం సందర్భంగా చిన్నారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. నేటి బాలలే రేపటి యువత.. దేశానికి భవిత! వారి కలలను సాకారం చేసి ప్రతిభను వెలికి తీసి, వారిలో ఆత్మ విశ్వాసంపెంచేలా తీర్చిదిద్దడం మనబాధ్యత. ఆధు నిక సాంకేతికత,విజ్ఞానం,నైపుణ్యాలతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాలు,విలువలు నేర్పే విద్యను అందించేందుకు ఎన్డీయే ప్రభుత్వంకట్టుబడిఉంది. బాలల అభ్యున్నతితోనే రాష్ట్ర ప్రగతి.. దేశ ప్రగతి. వారి ఉజ్వల భవిష్యత్తుకు భరోసా కల్పించాలన్న లక్ష్యంతో పనిచేసామని ఎక్స్‌వేదికగా పోస్ట్‌చేశారు.

భవిష్యత్‌కు పునాదులు చిన్నారులే: లోకేష్

బాలల దినోత్సవం సందర్భంగా మంత్రి లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు.'రేపటి గొప్ప భవిష్యత్‌కు పునాదులు మీరే. మీ కళ్లలోని అమాయకత్వం, మీచిరునవ్వులోని స్వచ్ఛత ఎప్పటికీ ఇలాగే ఉండా లని కోరుకుంటూ పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిసందర్భంగా ఎక్స్‌వేదికగా చిన్నారులంద రికీ జాతీయ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

అదృశ్యమైన పిల్లల ఆచూకీకి కమిటీలు

- **రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఏర్పాటు**
- **కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం**
- **మానవ అక్రమ రవాణా నిరోధానికి చర్యలు**
- **జీవో 26 విడుదల చేస్తూ ఉత్తర్వులు**

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో అదృశ్యమైన పిల్లల ఆచూ కీ, మానవ అక్రమ రవాణా నిరోధంపై కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేస్తూ మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జీవో జారీ చేసింది. ఈ మేరకు జీవోఎంఎస్ నెంబర్ 26ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ విడుదల చేశారు. ఈ ఉత్తర్వులను అనుసరించి తదుపరి చర్యలు తీసుకోవాలని గుంటూరులోని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

రాష్ట్ర స్థాయి కమిటీలో సభ్యులు

అదృశ్యమైన పిల్లలు, మానవ అక్రమ రవాణా నిరోధక చర్యల పర్యవేక్షణకు రాష్ట్రస్థాయిలో 16 మందితో కమిటీని ఏర్పాటు చేశా రు. రాష్ట్ర స్థాయి కమిటీకి మహిళా, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి/కార్యదర్శి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. డీజీపీ లేదా అదనపు డీజీపీ (సీఐడీ / మిస్సింగ్ చిల్డ్రన్) కో-ఛైర్‌పర్సన్‌గా ఉంటారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ / డైరెక్టర్ మెంబర్ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తారు. రాష్ట్ర నోడల్ అధికారి, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీ యూ) ఐజీ/ఎస్పీ స్థాయి అధికారి ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. కార్మిక, పాఠశాల విద్య, వైద్య ఆరోగ్య, సాంఘిక, గిరిజన, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ప్రతినిధులు కమిటీలో సభ్యులుగా వ్యవహరించనున్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, రైల్వే పోలీస్ (జీఆర్పీ/ఆర్పీఎఫ్), సైబర్ క్రైమ్/సీసీటీఎన్ఎస్ విభాగాల ప్రతినిధులతో పాటు ఇద్దరు స్వచ్ఛంద సంస్థల (ఎన్జీవో) ప్రతినిధులకు చోటు కల్పించారు.

జిల్లా స్థాయి కమిటీలో సభ్యులు

జిల్లాస్థాయిలో 12 మందితో కమిటీని ఏర్పాటు చేస్తారు. ఏపీలోని అన్ని జిల్లాల్లో కలెక్టర్లు/జిల్లా మేజిస్ట్రేట్ల చైర్‌పర్సన్‌గా జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. జిల్లా కమిటీకి ఎస్పీ ప్రతినిధి కో-ఛైర్‌పర్సన్‌గా, జిల్లా బాలల రక్షణ అధికారి (డీసీపీవో) మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. జిల్లా కమిటీలో ఏహెచ్‌టీయూ, బాలల సంక్షేమ కమిటీ (సీడబ్ల్యూసీ), డీఎల్ఎస్ఏ, రైల్వే పోలీస్, కార్మిక, విద్య, ఆరోగ్య శాఖలు, శిశు సంరక్షణ సంస్థలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు.

కమిటీల ప్రధాన విధులు

రాష్ట్రవ్యాప్తంగా అదృశ్యమైన పిల్లలు, అక్రమ రవాణా కేసుల స్థితిగతులను, ఎఫ్ఐఆర్‌ల నమోదు, దర్యాప్తు పురోగతిని రాష్ట్ర కమిటీ సమీక్షిస్తుంది. మానవ అక్రమ రవాణాకు అవకాశమున్న సున్నితమైన జిల్లాలు, ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టడంతో పాటు, గ్రామాలు, రవాణా మార్గాలపై జిల్లా కమిటీ లు నిఘా పెట్టనున్నాయి. రక్షించిన పిల్లలను తిరిగి కుటుంబాలకు అప్పగించే ముందు పూర్తిస్థాయి విచారణ జరపడంతో పాటు కుటుంబసభ్యుల ప్రమేయమున్న కేసులను ప్రత్యేకంగా సమీక్ష జరపనున్నారు. రక్షించిన పిల్లల ఆధార్ బయోమెట్రిక్ ధృవీకరణ, గుర్తింపు పత్రాల ప్రక్రియను ఈ కమిటీ పర్యవేక్షణ చేయనుంది. డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థలు, సీసీటీఎన్ఎస్ (జజుచీూ) అనుసంధా నం, అంతరాష్ట్ర సమన్వయ వ్యవస్థలను రాష్ట్ర కమిటీ పర్యవేక్షిస్తుం ది. రక్షించిన పిల్లలకు పునరావాసం, కౌన్సెలింగ్ కల్పించడంతో పాటు, వారిని తప్పనిసరిగా బాలల సంక్షేమ కమిటీ (సీడబ్ల్యూసీ) ఎదుట హాజరు పరచాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే జిల్లా, గ్రామస్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, జిల్లా కమిటీలు ప్రతినెలా రాష్ట్రస్థాయి కమిటీకి నివేదికలు సమర్పించాల్సి ఉంటుందని సర్కార్ స్పష్టం చేసింది.

చైతన్యరథం

శ్రీకాకుళాన్ని తీర్చిదిద్దడమే ఎన్డీఏ లక్ష్యం

- 60 డివిజన్లతో పాటు మేయర్ అభ్యర్థినీ భారీ మెజారిటీతో గెలిపించాలి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నగరాన్ని అభివృద్ధి చేస్తాం
- రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



శ్రీకాకుళం (చైతన్య రథం): శ్రీకాకుళం నగర సమగ్ర అభివృద్ధికి ఎన్డీఏ కూటమి కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రానున్న శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఎన్నికల్లో 60 డివిజన్లతోపాటు ఎన్డీఏ మేయర్ అభ్యర్థిని కూడా అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ విజయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ నాయకత్వానికి ఘనమైన కానుకగా అందించాలని కోరారు. శనివారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నగరపాలక సంస్థ ఎన్నికల సన్నాహక సమావేశం, అభ్యర్థుల ఎంపిక కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్, ఇతర ముఖ్య నాయకులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

ఎన్డీఏ కూటమి ఐక్యతతో ముందుకు సాగాలి

చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్, బీజేపీ నాయకత్వంపై విశ్వాసంతో పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని మంత్రి తెలిపారు. పార్టీలోకి వస్తున్న ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం కల్పిస్తామని, వారు నమ్ముకున్న ప్రజలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని భరోసాఇచ్చారు.శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఎన్నికల్లో రాష్ట్రంలోనే ఎన్నడూలేని రీతిలోభారీమెజారి టీ సాధించి కూటమి ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.

స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిన గత వైసీపీ ప్రభుత్వం

ప్రజాస్వామ్య వ్యవస్థలో స్థానిక సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని, అవి బలోపేతంగా ఉన్నప్పుడే అభివృద్ధి వేగవంతమవుతుందని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో స్థానిక సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు. స్థానిక సంస్థలకు నిధులు కేటాయించకపోవడంతో పాటు కేంద్ర ఆర్థిక సంఘం నిధులను కూడా పక్క దారి పట్టించారని ఆరోపించారు. నాయకత్వమంతా ఒక్కరి చేతిలోనే ఉండాలనే ధోరణితో శ్రీకాకుళం కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేశారని విమర్శించారు.

రూ.40 కోట్లతో సెంట్రల్ లైటింగ్.. రహదారుల విస్తరణ

శ్రీకాకుళం నగరాన్ని అందమైన, ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు తాము కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఎమ్మెల్యే గొండు శంకర్, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. నగరంలో రహదారుల విస్తరణతో పాటు సుమారు రూ. 40 కోట్లతో మోడల్ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రతి వీధిలోనూ ప్రజలకు సౌకర్యవంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యమన్నారు.

ప్రతి ఇంటికీ 24 గంటల స్వచ్ఛమైన తాగునీరు

నగరంలోని ప్రతి ఇంటికీ నిరంతరం 24 గంటల పాటు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో భాగంగా ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు.

రూ.100 కోట్లతో అరసవల్లి ఆలయ అభివృద్ధి

శ్రీకాకుళం నగరానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం కింద దాదాపు రూ. 100 కోట్ల నిధులు మంజూరైనట్లు మంత్రి వెల్లడించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సహకారంతో ఈ నిధులు సాధించామని తెలిపారు.

ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశామని, ఎన్నికల అనంతరం అధికారులతో సమీక్షించి ఆలయాన్ని అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తూ రెండేళ్లుగా ఘనంగా నిర్వహిస్తున్నామని గుర్తుచేశారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

వర్షాకాలంలో శ్రీకాకుళం నగరంలో ఏర్పడుతున్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని అచ్చెన్నాయుడు అన్నారు. భారీ వర్షాలకు నగరం జలమయమవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ముంపు సమస్యపై ప్రత్యేక దృష్టి సారించామని, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో కలిసి పీపీపీ విధానంలో కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు.

60 డివిజన్లలో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం

శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో ప్రస్తుతం 60 డివిజన్లు ఉన్నాయని, వీటిలో కొంత గ్రామీణ ప్రాంతం కూడా కలిసిందని మంత్రి తెలిపారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల మధ్య ఎలాంటి విభేదాలు లేకుండా హైకమాండ్ నిర్ణయాలకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని సూచించారు. కార్పొరేటర్ అభ్యర్థులుగా పోటీ చేసేందుకు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని, ఒక్కో డివిజన్‌కు ముగ్గురు, నలుగురు చొప్పున ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. కూటమి పార్టీల మధ్య సమన్వయం, అభ్యర్థుల అర్హతలు, ప్రజల్లో ఉన్న ఆదరణను పరిగణనలోకి తీసుకుని ఎంపిక ప్రక్రియ చేపడతామని స్పష్టం చేశారు. మేయర్ అభ్యర్థి ఎవరైనా అందరూ కలిసికట్టుగా పనిచేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నగరాభివృద్ధి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం, స్థానికంగా ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలోని నగరపాలక సంస్థ సమన్వయంతో పనిచేస్తే శ్రీకాకుళాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయవచ్చని మంత్రి పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభించిందని, తాలి విడతలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో 93 శాతం విజయాన్ని సాధించామని గుర్తుచేశారు.

గత రెండున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసాన్ని పెంచాయని అన్నారు. రానున్న పది రోజుల పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని, అభ్యర్థుల తరఫున విస్తృత ప్రచారం నిర్వహించాలని అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. కూటమి ఐక్యతను కాపాడుకుంటూ శ్రీకాకుళం నగరపాలక సంస్థపై ఎన్డీఏ జెండా ఎగురవేయాలని ఆకాంక్షించారు.

లక్కిరెడ్డిపల్లెలో వైసీపీకి భారీ షాక్..

- టీడీపీలోకి 200 కుటుంబాలు
- మాజీ జడ్పీటీసీ, మాజీ ఎంపీపీ మద్దిరేవుల ఆధ్వర్యంలో చేరికలు



రాయచోటి (చైతన్య రథం): లక్కిరెడ్డిపల్లి మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మండలంలోని మద్దిరేవుల గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ, మాజీ ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 200 కుటుంబాల నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నూతనంగా పార్టీలో చేరిన వారికి తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేస్తూ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని అన్నారు. ప్రభుత్వ ప్రజాహిత పాలనకు ఆకర్షితులై వివిధ వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా తెలుగుదేశం పార్టీ వైపు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోనమల ఖాదరవల్లి, మండల జడ్పీటీసీ యనమల మదన్ మోహన్, రాష్ట్ర ఫారెస్ట్ డైరెక్టర్ రెడ్డయ్య యాదవ్, మాజీ ఎంపీపీ అంపాబతిన రెడ్డయ్యతో పాటు ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతనంగా పార్టీలో చేరిన వారికి అభినందనలు తెలిపారు.

జాతీయ రహదారిపై సుందరమైన ఐకాన్



- ఆత్మకూరు పట్టణ ప్రత్యేకతను చాటేలా నిర్మాణం
- బైపాస్ రోడ్డు ప్రారంభ ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి ఆనం

ఆత్మకూరు (చైతన్య రథం): జాతీయ రహదారిపై ఆత్మకూరు పట్టణానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేలా సుందరమైన ఐకాన్ నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. పట్టణ చారిత్రక ప్రాధాన్యత, సాంస్కృతిక వైభవం ప్రతిబింబించేలా ఈ నిర్మాణం ఉండాలని సూచించారు. ఈ మేరకు శనివారం ఆత్మకూరు బైపాస్ రోడ్డు ప్రారంభ ప్రాంతాన్ని సంబంధిత అధికారులతో కలిసి మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జాతీయ రహదారి మీదుగా ఆత్మకూరు పట్టణంలోకి ప్రవేశించే ప్రయాణికులకు పట్టణ ప్రత్యేకతను పరిచయం చేసేలా, ఆకట్టుకునే విధంగా ఐకాన్ నిర్మాణం చేపట్టేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఆత్మకూరుకు ఉన్న చారిత్రక నేపథ్యం, సాంస్కృతిక ప్రాధాన్యత, స్థానిక విశిష్టతలు ప్రతిబింబించేలా ఐకాన్ రూపకల్పన చేయాలని మంత్రి సూచించారు. పట్టణ సుందరీకరణలో ఈ నిర్మాణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా ఆధునిక నిర్మాణ శైలి, వినూత్న డిజైన్‌తో ప్రణాళికలు సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు. జాతీయ రహదారిపై ప్రయాణించే వారిని ఆకర్షించడంతో పాటు ఆత్మకూరు పట్టణానికి శాశ్వత గుర్తింపుగా ఈ ఐకాన్ నిలవాలని మంత్రి ఆకాంక్షించారు. ఇందుకు సంబంధించి అవసరమైన ప్రతిపాదనలు, నమూనాలను త్వరితగతిన సిద్ధం చేసి తదుపరి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

నామినేషన్ల సమర్పణకు కావాలంటే ప్రత్యేక ఎస్కార్ట్

ఎన్నికల శాంతి భద్రతలపై ఎస్ఈసీ సమీక్ష



తిరుపతి (చైతన్య రథం): గ్రామ పంచాయతీ ఎన్నికలు, పెండింగులోవున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలపై ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా శనివారం సమీక్ష నిర్వహించారు. తిరుపతి కలెక్టరేట్‌లో అధికారులతో ఎస్ఈసీ సమావేశమయ్యారు. ఈ సమావేశానికి 12 జిల్లాల పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల నిర్వహణపై అధికారులతో చర్చించారు. భేటీ అనంతరం ఎస్ఈసీ మీడియాతో మాట్లాడారు. “ఇటీవల జరిగిన ఎన్నికల్లో పల్నాడు నుంచి రాయలసీమ వరకు కొన్ని గొడవలు జరిగాయి. సమస్యాత్మక 12 జిల్లాల ఎస్పీలతో ప్రత్యేకంగా మాట్లాడాం. పంచాయతీ ఎన్నికల సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించాం. నామినేషన్ల సమర్పణకు ఎవరైనా ప్రత్యేక ఎస్కార్ట్ కావాలంటే కల్పిస్తాం. దాడి ముప్పు ఉందని ఎస్పీకి చెప్తే.. అభ్యర్థులకు ప్రత్యేక భద్రత కల్పిస్తారు” అన్నారు. “పంచాయతీరాజ్ శాఖలో నిన్న కొత్త జీవో జారీ అయ్యింది. ఏకగ్రీవం అయిన గ్రామాలకు ప్రభుత్వం ప్రోత్సాహక నిధులు ఇస్తుంది. ఐదు వేల వరకు జనాభా ఉన్న గ్రామానికి రూ.15 లక్షల ప్రోత్సాహక నిధులు వస్తాయి. ఐదు వేల నుంచి పది వేల వరకు జనాభా ఉన్న గ్రామాలకు రూ.25 లక్షల నిధులు అందుతాయి. 15 నుంచి 20 శాతం గ్రామాల్లో ఏకగ్రీవ ఎన్నిక జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది” అని వివరించారు.

ఉత్తరాంధ్రకు పొంచివున్న మరో తుపాను

విశాఖపట్నం (చైతన్య రథం): ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న సుస్పష్టమైన అల్పపీడనం వాయువ్యదిశగా కదులుతూ మరి కొన్ని గంటల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం అధికారి వెంకన్నదొర తెలిపారు. ఈనెల 16న తుపానుగా, 18న ఉదయానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో ఈనెల 18, 19 తేదీల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీనుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. 18న శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. 19న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, పార్వతీపురం మన్యం, అల్లూరి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్టు చెప్పారు. ఈనెల 16 నుంచి తీరం వెంట గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు.. గరిష్ఠంగా 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొన్నారు. చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు ఆదివారం సాయంత్రానికి తీరాలకు చేరుకోవాలని సూచించారు. ఈనెల 16 నుంచి మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు.



గిరిబాబు ఆత్మకు శాంతి చేకూరాలి: డిప్యూటీ సీఎం





అమరావతి (చైతన్య రథం): ప్రముఖ నటుడు గిరిబాబు మరణం పట్ల ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. ప్రతినాయకుడిగా, కథానాయకుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా గిరిబాబు విభిన్నమైన పాత్రలు పోషించారని, చక్కటి హాస్యం పండించారని గుర్తు చేసుకున్నారు. నిర్మాతగా, దర్శకుడిగా విజయవంతమైన చిత్రాలు రూపొందించారన్నారు. గిరిబాబు కుమారుడు, నటుడు రఘుబాబుకి, ఇతర కుటుంబ సభ్యులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

నటుడు గిరిబాబు మృతికి మంత్రి డోలా సంతాపం



అమరావతి (చైతన్య రథం): సినీనటుడు గిరిబాబు మృతి పట్ల మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం మంత్రి మాట్లాడుతూ... గిరిబాబు కిందిస్థాయి నుంచి స్వయంకృషితో అంచలంచలుగా ఎదిగి సినీరంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారన్నారు. గిరిబాబు తనవంతుగా సమాజం కోసం అనేక సేవా కార్యక్రమాలు చేశారని, ఎంత ఎదిగినా సొంత ఊరిపై మమకారంతో రావినూతల గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. గిరిబాబుకు ప్రకాశం జిల్లాకు విడదీయలేని బంధం ఉందన్నారు. గిరిబాబు ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గిరిబాబు మృతి సినీ పరిశ్రమకు తీరని లోటు

సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్



అమరావతి (చైతన్య రథం): ప్రముఖ సినీ నటుడు గిరిబాబు మృతిపట్ల రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తనదైన విలక్షణ నటనతో దశాబ్దాల పాటు ప్రేక్షకులను అలరించిన గిరిబాబు మరణం బాధాకరమని పేర్కొన్నారు. నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా తెలుగు సినీ పరిశ్రమలో గిరిబాబు ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని మంత్రి కొనియాడారు. వందలాది చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషిస్తూ తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని తెలిపారు. ప్రతినాయకుడిగా, హాస్యనటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా తనదైన నటనా శైలితో ప్రేక్షకులను మెప్పించిన గొప్ప కళాకారుడని ప్రశంసించారు. గిరిబాబు మరణం తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

10, 16 ఏళ్ల పిల్లలకు ప్రత్యేక టీడీ టీకాలు

- డిసెంబరు 3 నుంచి 5 వరకు రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమం
- 28 జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో నిర్వహణ..
- 95 శాతానికి పైగా టీకా కవరేజీ లక్ష్యం

అమరావతి (చైతన్య రథం): డిఫ్తీరియా, ధనుర్వాతం వ్యాధుల నుంచి పిల్లలకు అదనపు రక్షణ కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. డిసెంబరు 3 నుంచి 5వ తేదీ వరకు 28 జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలల్లో 10, 16 ఏళ్లు పూర్తి చేసుకున్న పిల్లలకు టీడీ టీకాలు వేయనున్నారు. ఈ కార్యక్రమంలో 95 శాతానికి పైగా టీకా కవరేజీ సాధించాలని వైద్య ఆరోగ్యశాఖ లక్ష్యంగా నిర్దేశించింది. చిన్నతనంలో సాధారణ టీకాల కార్యక్రమంలో భాగంగా వేసిన పెంటావాలెంట్ టీకాల ద్వారా లభించిన రక్షణను మరింత బలోపేతం చేసేందుకు యుక్తవయసులో ఈ అదనపు టీకాలు వేయనున్నారు. డిఫ్తీరియా, ధనుర్వాతం తీవ్రమైన అనారోగ్యానికి, ఒక్కోసారి ప్రాణాపాయానికి కూడా దారితీసే వ్యాధులు కావడంతో పిల్లలకు తగిన వయసులో అదనపు రక్షణ కల్పించడం అవసరమని వైద్య ఆరోగ్యశాఖ పేర్కొంది. 10 ఏళ్లు పూర్తి చేసుకున్న వారికి టీడీ-10, 16 ఏళ్లు పూర్తి చేసుకున్న వారికి టీడీ-16 టీకాలు వేయనున్నారు.

అర్హుల గుర్తింపునకు ప్రత్యేక సర్వే

టీకా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఏఎన్ఎం తన పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలల జాబితాను సిద్ధం చేయాలి. టీకాలు తీసుకోవాల్సిన అర్హుల వివరాలను సేకరించి, ఇప్పటికే యూవిన్ పోర్టల్‌లో నమోదు కాని వారి వివరాలను నమోదు చేయాలి. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లని అర్హులైన పిల్లలను కూడా గుర్తించి టీకా కార్యక్రమంలో భాగస్వాములను చేయాలి. సాధారణ టీకాల కార్యక్రమంలో ఇప్పటికే సంబంధిత టీకా తీసుకున్న పిల్లలకు తిరిగి టీకా వేయకూడదని స్పష్టం చేశారు.

పాఠశాలల వారీగా కార్యాచరణ ప్రణాళిక

ప్రత్యేక కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించేందుకు ఏఎన్ఎంలు పాఠశాలలు, కళాశాలల వారీగా సూక్ష్మ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి. ఇందులో విద్యాసంస్థల పేర్లు, గ్రామాలు, బాధ్యతలు నిర్వహించే ఏఎన్ఎంలు, పిల్లలను సమీకరించే సిబ్బంది వివరాలు, అవసరమైన టీకాలు, వైద్య సామగ్రి, టీకాల పంపిణీ విధానం పొందుపరచాలి. యూవిన్ పోర్టల్‌లో అదనపు టీకా కేంద్రాలను ఏర్పాటు చేసి, వాటి సమయాలను ముందుగానే నిర్ణయించాలని సూచించారు.

వివిధ శాఖల సమన్వయంతో అవగాహన

టీకాల ప్రాధాన్యతపై వైద్యాధికారులు, పర్యవేక్షకులు, మధ్యస్థాయి ఆరోగ్య ప్రదాతలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, జిల్లా టీకా అధికారులు, వైద్యాధికారులు మహిళా, శిశు సంక్షేమం, విద్య, మైనారిటీ సంక్షేమం, పంచాయతీరాజ్, పురపాలక శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలి. జిల్లా, మండల స్థాయి టీకా కార్యాచరణ బృందాల ద్వారా ఆయా శాఖల సహకారం తీసుకోవాలని ఆదేశించారు.

టీకా కేంద్రాల్లో అత్యవసర వైద్య ఏర్పాట్లు

ప్రతి టీకా కేంద్రంలో అవసరమైన టీకాలు, వైద్య సామగ్రిని తగినంతగా అందుబాటులో ఉంచాలి. టీకా అనంతరం తీవ్రమైన అలర్జీ వంటి అత్యవసర పరిస్థితులు తలెత్తితే తక్షణ చికిత్స అందించేందుకు అన్‌ఫైలాక్సిస్ కిట్ తప్పనిసరిగా అందుబాటులో ఉండాలి. ప్రతి టీకా కేంద్రాన్ని సమీపంలోని టీకా అనంతర ప్రతికూల ప్రభావాల నిర్వహణ కేంద్రంతో అనుసంధానించాలి.

24 గంటల్లో యూవిన్ పోర్టల్‌లో నమోదు

టీకా కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు జిల్లా స్థాయి పరిశీలకులను నియమించాలి. జిల్లా టీకా అధికారులు, వైద్యాధికారులు, పర్యవేక్షకులు ప్రత్యేక టీకా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు సమస్యలను పరిష్కరించాలి. టీకాలు తీసుకున్న పిల్లల వివరాలను 24 గంటల్లోగా యూవిన్ పోర్టల్‌లో నమోదు చేసి, డిజిటల్ టీకా ధ్రువపత్రాలు జారీ చేయాలి. ఆర్‌సీహెచ్, హెచ్ఎంఐఎస్ పోర్టళ్లలోనూ వివరాలను నమోదు చేయాలి. జిల్లాల వారీగా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో రోజువారీ టీకా కవరేజీ నివేదికలను సేకరించి రాష్ట్ర టీకా అధికారికి పంపించాలి. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే పిల్లలతో పాటు వాటికి వెళ్లని అర్హులైన పిల్లలందరికీ టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, జిల్లా టీకా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, జాతీయ ఆరోగ్య మిషన్ సంచాలకుడు కె.వి.ఎన్. చక్రధర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు.

బాలల ఆరోగ్యానికి పోషకాహార తోటలు ఎంతో దోహదం



- విద్యార్థులు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలి
- పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- ప్రభుత్వ కార్యదర్శి ముదావత్ ఎం.నాయక్

నందిగామ (చైతన్య రథం): బాలల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పోషకాహారం ఎంతో కీలకమని, విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవరచుకోవాలని ప్రభుత్వ కార్యదర్శి ముదావత్ ఎం. నాయక్ సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు నెట్ జీరో లక్ష్యాల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నవంబర్ 14 బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నందిగామ మండలం ముప్పాళ్లలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకులంలో నిర్వహించిన బాలల పోషకాహార తోటల పండుగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో విత్తనాలు నాటి, మొక్కలు నాటడం ద్వారా పోషకాహార తోటను ప్రారంభించారు. విద్యార్థినులు స్వయంగా కూరగాయలు, ఆకుకూరలు, పోషక విలువలు కలిగిన మొక్కలను పెంచుకోవడం ద్వారా తాజా, సహజమైన ఆహారాన్ని పొందవచ్చని నాయక్ తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పోషకాహారంపై అవగాహన పెంచడమే కాకుండా ప్రకృతితో అనుబంధాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.

నెట్ జీరో కార్యక్రమం ప్రాధాన్యతను వివరిస్తూ కర్బన ఉద్గారాలను తగ్గించడం, మొక్కలను విరివిగా పెంచడం, నీరు, విద్యుత్తును పొదుపుగా వినియోగించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి, పరిసరాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉంచాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని, విద్యార్థులు తమ ఇళ్లలో, పాఠశాలల్లో పర్యావరణహిత అలవాట్లను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. నేటి విద్యార్థులే రేపటి పర్యావరణ పరిరక్షకులని, ప్రకృతి వనరులను కాపాడుకోవడం ద్వారా భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన, సుస్థిరమైన వాతావరణాన్ని అందించగలమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి ఎన్.తేజ్ భరత్, అదనపు కార్యదర్శి పద్మావతి, నెట్ జీరో ఎస్‌పీడీ శరవణన్, కృష్ణాజిల్లా డీసీవో టి.మురళీకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అక్రమ నిల్వలపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత తనిఖీలు

రూ.10.43 కోట్ల విలువైన సరుకులు స్వాధీనం.. 516 కేసులు నమోదు

విజయవాడ (చైతన్య రథం): రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, నిల్వలు, సరఫరా, లభ్యతపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ హరీష్ కుమార్‌గుప్తా ఉత్తర్వుల మేరకు ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఇప్పటివరకు నిర్వహించిన తనిఖీల్లో సుమారు రూ.10.43 కోట్ల విలువైన నిత్యావసర సరుకులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్టోబర్ 26 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సుమారు 300 తనిఖీ బృందాలు 250 మార్కెట్లు, వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాయి. ఇందులో భాగంగా 715 హోల్‌సేల్ వ్యాపార సంస్థలు, 17 రైస్ మిల్లులు, 13 గోదాములు, 145 రిటైల్ దుకాణాలను పరిశీలించి మొత్తం 516 కేసులు నమోదు చేశారు. నిత్యావసర వస్తువుల ధరల అసాధారణ పెరుగుదల, కృత్రిమ కొరత సృష్టించడం, అక్రమ నిల్వలకు సంబంధించి ఐదు ప్రత్యేక సందర్భాలను గుర్తించారు. తనిఖీల్లో భాగంగా సుమారు 160 టన్నుల బియ్యం,



2,018 మెట్రిక్ టన్నుల ధాన్యం, 830 కిలోల పప్పులు, 1,930 లీటర్ల వంట నూనె, 9.3 మెట్రిక్ టన్నుల పసుపుతో పాటు అక్రమ రవాణాకు సంబంధించిన 1,050 కిలోల సరుకులను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.10.43 కోట్లుగా అధికారులు వెల్లడించారు.

నిత్యావసర వస్తువుల అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు, బ్లాక్ మార్కెటింగ్ వంటి అక్రమ కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని విజిలెన్స్ అధికారులు స్పష్టం చేశారు. ప్రజలకు నిత్యావసర సరుకులు సరసమైన ధరలకు అందుబాటులో ఉండేలా మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి పౌర సరఫరాలు, జీఎస్టీ, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ, పోలీస్ శాఖల సమన్వయంతో తనిఖీలు మరింత ముమ్మరం చేస్తామని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించి అక్రమాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ (PD Act) కింద కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ హరీష్ కుమార్ గుప్తా హెచ్చరించారు.





పోర్టులే ఏపీ ప్రగతి రథాలు!



ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరాన్ని ప్రకృతి ప్రసాదించిన వనరుగా మాత్రమే చూశాం. ఇప్పుడు అదే తీరాన్ని రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తును మార్చగల అభివృద్ధి వనరుగా మలిచే ప్రయత్నం చేస్తుంది కూటమి ప్రభుత్వం. పోర్టులు-ఇండస్ట్రియల్ కారిడార్లు- ల్యాండ్ బ్యాంకులు-లాజిస్టిక్ పార్కులు. ఈ నాలుగింటి అనుసంధానంతో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక గమ్యస్థానంగా మారబోతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2024-29 మారిటైమ్ పాలసీ ద్వారా 2030 నాటికి రాష్ట్రాన్ని దేశంలో ప్రధాన సముద్ర వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2047 నాటికి దేశ పోర్టు కార్గోలో 20 శాతం వాటా సాధించడం, తూర్పు తీరంలో అంతర్జాతీయ సముద్ర వాణిజ్యానికి ఆంధ్రప్రదేశ్ కీలక కేంద్రంగా ఎదగనున్నది. పోర్టులు అంతర్జాతీయ వాణిజ్యానికి, పారిశ్రామిక విప్లవానికి ప్రవేశద్వారాలు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సముద్ర మార్గాలదే కీలక పాత్ర. ఎగుమతులు, దిగుమతులు, భారీ పరిశ్రమలు, విదేశీ పెట్టుబడులు, లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు. వీటన్నింటికీ పోర్టులే ప్రధాన రథ చక్రాలు. సుదీర్ఘ సముద్ర తీరం, అపారమైన భౌగోళిక అనుకూల తలు కలిగిన ఆంధ్రప్రదేశ్‌కు ఈ పోర్టులు ప్రకృతి ప్రసాదించిన అభివృద్ధి వరం. ఇప్పటివరకు సముద్ర తీర ప్రాంతాలకే పరిమితమైన పోర్టుల ప్రాధాన్యతను రాష్ట్రవ్యాప్త ఆర్థిక ప్రగతికి అనుసంధానించే దిశగా అడుగులు పడుతున్నాయి. పోర్టుల నిర్మాణం, విస్తరణతో పాటు పోర్టు ఆధారిత పారిశ్రామికవాడలు, లాజిస్టిక్స్ హబ్‌లు, గోదాములు, రవాణా నెట్‌వర్క్‌లు, ల్యాండ్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే కీలక సముద్ర వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దబోతోంది కూటమి ప్రభుత్వం. ఒక పోర్టు నిర్మాణమైతే కేవలం నౌకల రాకపోకలు పెరగవు... దానిచుట్టూ పరిశ్రమలు ఏర్పాటు, వ్యాపారాలు విస్తరిస్తరణ, స్థానికులకు ఉపాధి, ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుంది. అందుకే పోర్టుల అభివృద్ధి అంటే కేవలం మౌలిక సదుపాయాల కల్పన కాదు. రాష్ట్ర ఆర్థిక ముఖ చిత్రాన్ని మార్చే బృహత్తర ప్రణాళిక. ఆ దిశగా కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం సాకారమైతే సాగర తీర ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, వాణిజ్య ప్రగతికి చిరునామాగా మారడం ఖాయం.

రాష్ట్ర పారిశ్రామిక రంగం ప్రగతి రథం పరుగులు!

పొడవైన సముద్ర తీరం, పోర్టులు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఎంతో ఉపయోగకరమని, అందుకే ఏపీలో పోర్టులను మరింత అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ విశాఖ సీఐఐ సదస్సులో అన్నారు. ఖరగ్‌పూర్-అమరావతి కారిడార్ వస్తే విశాఖ, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం పోర్టులకు ఎంతో మేలు జరుగుతుందని, భవిష్యత్తులో ఏపీ అభివృద్ధిలో పోర్టులే కీలక పాత్ర పోషిస్తాయని కేంద్ర మంత్రి అన్నారు. ఓడరేవులను ప్రగతి ద్వారాలుగా తీర్చిదిద్దగలిగితే ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతం రాష్ట్ర ఆర్థిక పటంలోనే కాదు, దేశ సముద్ర వాణిజ్య పటంలోనూ ప్రత్యేక స్థానం సంపాదించగల దన్నారు. విశాఖపట్నం, గంగవరం, కృష్ణపట్నం, కాకినాడ వంటివి ఇప్పటికే ఉన్న ప్రధాన పోర్టులతో పాటు రాష్ట్రంలో కొత్తగా రూపుదిద్దుకుంటున్న గ్రీన్ ఫీల్డ్ పోర్టులు, రామాయపట్నం పోర్టు (ప్రకాశం జిల్లా) సెంట్రల్ ఏపీ మరియు పొరుగు రాష్ట్రాల వ్యాపారానికి గుండెకాయ. భావనపాడు-మూలపేట పోర్టు (శ్రీకాకుళం జిల్లా) ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్నే మార్చే ప్రాజెక్ట్. కాకినాడ గేట్‌వే, మచిలీపట్నం పోర్టులు, ఈ నాలుగు గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల తొలి దశ నిర్మాణాన్ని మూలపేట (శ్రీకాకుళం) జూన్ 2027-రామాయపట్నం (ప్రకాశం) ఏప్రిల్ 2027-మచిలీ పట్నం (కృష్ణా) డిసెంబర్ 2027-కాకినాడ గేట్‌వే సెప్టెంబరు 2028 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకొని తాజాగా రెండోసారి నిర్మాణ గడువు పొడి గిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పోర్టుల నిర్మాణ పురోగతి మూలపేట-సుమారు 78శాతం-రామాయపట్నం-80శాతం-మచిలీపట్నం-59శాతం-కాకినాడ- సుమారు 45 శాతం పురోగతి ఉన్నట్లు సమాచారం. మూలపేట నుంచి రామాయపట్నం వరకు, మచిలీ పట్నం నుంచి కాకినాడ గేట్‌వేవరకు పోర్టుల అభివృద్ధి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే రాష్ట్ర పారిశ్రామికరంగం ప్రగతి రథం పరుగులు తీయనుంది.

ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రముఖ సముద్ర వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశం

ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాన్ని దేశంలోనే అగ్రగామి లాజిస్టిక్స్, మారిటైమ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పోర్టులను జాతీయ రహదారులు, రైల్వే నెట్‌వర్క్‌తో కనెక్ట్ చేయడం. విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లకు ఈ పోర్టులే ప్రధాన బలం కానున్నాయి. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానంలో సముద్ర తీరం సరికొత్త చరిత్రకు వేదికగా మారబోతున్నది. ఆర్థిక ప్రగతికి బలమైన పునాది వేయాలంటే ఓడరేవుల అభివృద్ధి అత్యంత కీలకం. ఈ లక్ష్యంతోనే రాష్ట్రంలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల నిర్మాణం, రహదారి-రైల్వే అనుసంధానం, సరకు రవాణా వ్యవస్థల ఆధునికీకరణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుంది. పోర్టుల ఆధారిత అభివృద్ధి ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రముఖ సముద్ర వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశముంది. ఓడరేవులు అంటే కేవలం నౌకలు నిలిపే ప్రాంతాలు మాత్రమే కాదు. అవి పరిశ్రమలకు ప్రవేశ ద్వారాలు. ఎగుమతులకు వేదికలు. పెట్టుబడులకు ఆకర్షణ కేంద్రాలు. వేలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పించే ఆర్థిక వ్యవస్థలు. ఒక ఆధునిక పోర్టు అందుబాటులోకి వస్తే దాని చుట్టూ గోదాములు, కోల్డ్ స్టోరేజీలు, రవాణా సంస్థలు, లాజిస్టిక్స్ పార్కులు, పరిశ్రమలు, సేవారంగ సంస్థలు అభివృద్ధి చెందుతాయి. అందుకే పోర్టుల అభివృద్ధిని రాష్ట్ర భవిష్యత్తును మార్చగల వ్యూహాత్మక పెట్టుబడిగా చూడాలి. నాలుగు గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు అభివృద్ధికి నాలుగు ద్వారాలు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న నాలుగు కీలక పోర్టులు మూలపేట, రామాయపట్నం, మచిలీపట్నం, కాకినాడ గేట్‌వే పోర్టులు. కేంద్ర ఓడరేవులు, నౌకాయాన, జలమార్గాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ పోర్టుల ద్వారా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులను దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు మరింత సమర్థంగా తరలించవచ్చు. సరకు రవాణా కోసం ఇతర రాష్ట్రాల ఓడరేవులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. ఎగుమతిదారులకు రవాణా దూరం, సమయం, వ్యయాన్ని తగ్గించే అవకాశం లభిస్తుంది.

పోర్టులు చుట్టూ రవాణా, గోదాములు, అనుబంధ పరిశ్రమలు

పారిశ్రామిక అభివృద్ధికి ప్రకాశం, నెల్లూరు ప్రాంతాలకు రామాయపట్నం పోర్టు వ్యూహాత్మకంగా ఎంతో ప్రాధాన్యం కలిగిన ప్రాజెక్టులు. వ్యవసాయ ఉత్పత్తులు, పారిశ్రామిక ముడిసరుకులు, ఇతర సరకు రవాణాకు ఈ పోర్టులు ఉపయోగపడనున్నాయి. పోర్టు చుట్టూ రవాణా, గోదాములు, సరకు నిర్వహణ, అనుబంధ పరిశ్రమలు విస్తరిస్తే స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుంది. మూలపేట ఉత్తరాంధ్రకు సముద్ర వాణిజ్య ద్వారం శ్రీకాకుళం జిల్లాలోని మూలపేట పోర్టు ఉత్తరాంధ్ర ఆర్థికాభివృద్ధికి కీలకమైన అవకాశాలను అందించగ లదు. విశాఖపట్నం ప్రాంతానికి ఉత్తరంగా ఉండే ఈ పోర్టు, తగిన రవాణా అనుసంధానాలు ఏర్పడితే సరకు రవాణా వ్యవస్థను మరింత విస్తరించగలదు. వ్యవసాయ ఉత్పత్తులు, ఖనిజాలు, పారిశ్రామిక సరకు నిర్వహణకు అనుకూలమైన వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. పోర్టు అభివృద్ధి వల్ల స్థానిక యువతకు ఉపాధి,చిన్న వ్యాపారులకు కొత్త మార్కెట్లు, రవాణా రంగానికి అదనపు కార్యకలాపాలు లభించ వచ్చు. వాణిజ్యానికి కొత్త బాట కృష్ణా జిల్లా మచిలీ పట్నం పోర్టు. అభివృద్ధి కోస్తా ప్రాంత ఆర్థిక కార్యకలాపాలకు కొత్త అవకాశాలను తెరవగలదు. విజయవాడ, గుంటూరు, కృష్ణా, గోదావరి ప్రాంతాల వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులకు మెరుగైన సముద్ర రవాణా మార్గాలు అందుబాటులోకి వస్తే ఎగుమతులకు ఊతం లభిస్తుంది. అంతర్జాతీయ మార్కెట్లకు చేరే సరకు రవాణా ప్రక్రియ వేగవంతమైతే రైతులు, ఆహార ప్రాసెసింగ్ సంస్థలు, పారిశ్రామిక యూనిట్లకు ప్రయోజనం కలుగుతుంది. ముఖ్యంగా పండ్లు, కూరగాయలు, ఆహార ఉత్పత్తుల ఎగుమతు లకు కోల్డ్ చైన్, శీతల గోదాములు, వేగవంతమైన రవాణా వ్యవస్థలు కీలకం. పోర్టు అభివృద్ధితో పాటు ఈ సదుపాయాలను కూడా ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేయాలి. కాకినాడ గేట్‌వే ఈ ప్రాంతంలో ఇప్పటికే సముద్ర వాణిజ్య కార్యకలాపాలు ఉన్న నేపథ్యంలో, ఈ పోర్టు అభివృద్ధి అదనపు సామర్థ్యాన్ని అందించే అవకాశముంది.తీర ప్రాంత పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత సంస్థలు, సరకు రవాణా కంపెనీలు, ఎగుమతిదారుల అవసరాల ను తీర్చనున్నది. పోర్టు చుట్టూ సమగ్ర లాజిస్టిక్స్ వ్యవస్థ అభివృద్ధి చెందితే తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ పరిసర ప్రాంతాలకు ఆర్థిక ప్రయోజనాలు విస్తరించే అవకాశం ఉంటుంది.

హోటళ్లు, ఇతర సేవా రంగాల్లోనూ ఉపాధి అవకాశాలు విస్తరించవచ్చు

పోర్టుల నుంచి పరిశ్రమలకు, పరిశ్రమల నుంచి ఉపాధికి, పోర్ట్-లెడ్ డెవలప్‌మెంట్ విజయవంతం కావాలంటే ఓడరేవుల నిర్మాణాన్ని పారిశ్రామికాభివృద్ధి తో అనుసంధానించాలి. పోర్టుల సమీపంలో పారిశ్రామిక పార్కులు, గోదాములు, కంటైనర్ టెర్మినళ్లు, లాజిస్టిక్స్ కేంద్రాలు, ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు ప్రోత్సాహం ఇవ్వాలి. ఎగుమతులకు అనువైన ఉత్పత్తుల తయారీకి పెట్టుబడులను ఆకర్షించాలి. పోర్టుల్లో ప్రత్యక్షంగా నౌకా నిర్వహణ, సరకు లోడింగ్, అన్‌లోడింగ్, భద్రత, సాంకేతిక నిర్వహణ వంటి ఉద్యోగాలు ఏర్పడతాయి. వాటికి అనుబంధంగా ట్రాన్స్‌పోర్ట్, గోదాములు, ప్యాకేజింగ్, మరమ్మతులు, హోటళ్లు, ఇతర సేవా రంగాల్లోనూ ఉపాధి అవకాశాలు విస్తరించవచ్చు. స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఈ అవకాశాలను అందిపుచ్చుకునేలా చేయాలి.. ఐటీఐ లు, పాలిటెక్నిక్ కళాశాలలు, నైపుణ్యాభివృద్ధి సంస్థల ద్వారా పోర్టు నిర్వహణ, లాజిస్టిక్స్, మెరైన్ సర్వీసులు, యంత్రాల నిర్వహణలో శిక్షణ అందిస్తే స్థానికులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుతుంది. సముద్ర వనరులను స్థిరమైన పద్ధతుల్లో వినియోగిస్తూ ఆర్థిక వృద్ధి, ఉపాధి, పర్యావరణ పరిరక్షణను సమన్వయం చేయాలి. సముద్రాన్ని కేవలం వాణిజ్య మార్గంగా కాకుండా సంపద సృష్టించే వనరుగా చూడాలి. మత్స్యకారుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, చేపల నిల్వ-రవాణా సదుపాయాలు పెంచడం, తీరప్రాంత కాలుష్యాన్ని నియంత్రించడం, సముద్ర జీవవైవిధ్యాన్ని కాపాడటం కూడా అభివృద్ధిలో భాగం కావాలి.

ఉత్పత్తులు అదనంగా ఎగుమతికి అవకాశం

ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న సుదీర్ఘ సముద్ర తీరం ఒక భౌగోళిక ప్రత్యేకత మాత్రమే కాదు. రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తును మార్చగల అపారమైన అవకాశం కూడా. పోర్టులు నిర్మించడం మొదటి అడుగు అయితే, వాటి ద్వారా సంపదను సృష్టించడం అసలైన విజయం... ఏపీలో వున్న పోర్టుల ద్వారా 2025-26లో రూ.14,630 కోట్ల విలువైన ఎగుమతులు జరిగినట్లు, వాటిలో కంటైనర్ ద్వారా రూ.8,540 కోట్లు, నాన్-కంటైనర్ విధానంలో రూ.6,090 కోట్ల ఎగుమతులు జరిగినట్లు సమాచారం. గత ఐదేళ్లలో పోర్టుల ద్వారా ఎగుమతుల్లో ఏటా 1.5% కాంపౌండ్ గ్రోత్ రేట్ నమోదు కాగా, నిర్మాణంలో ఉన్న పోర్టులు కూడా పూర్తయితే మరో రూ.8,095 కోట్ల ఉత్పత్తులు అదనంగా ఎగుమతికి అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే నిర్మాణంలో ఉన్న శ్రీకాకుళం జిల్లాలోని మూలపేట, కాకినాడ, నెల్లూరు జిల్లాలోని రామాయపట్నం పోర్టులను 2027 డిసెంబరులోగా పూర్తి చేయడంతో పాటు తిరుపతి జిల్లాలో ప్రతిపాదించిన దుగరాజపట్నం ఓడరేవు పనులూ మొదలు పెట్టాలని ఏపీ మారిటైం బోర్డు భావిస్తోంది. తమిళనాడు, ఒడిశా, కర్ణాటక రాష్ట్రాల్లో పోర్టులు ఉన్నప్పటికీ ఏపీ సరిహద్దు ఆనుకుని ఉన్న ప్రాంతాల నుంచి ఉత్పత్తులను పోర్టుకు తరలించాలంటే దూరం ఎక్కువగా ఉంది.ఆయా ప్రాంతాలకు రాష్ట్రంలోని పోర్టుల ద్వారా సేవలు అందించాలన్నది ప్రభుత్వ ఆలోచన. అలాగే తీర ప్రాంతం లేని తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు మహారాష్ట్రలోని పోర్టులపై ఎక్కువగా ఆధారపడుతు న్నాయి. ఆయా రాష్ట్రాలనూ ఏపీలోని పోర్టులను వినియోగించుకునేలా ప్రోత్సహించాలని, తద్వారా ఎగుమతుల విలువను పెంచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

- నీరుకొండ ప్రసాద్

విజ్ఞాన వైష్ణవికి ఎమ్మెల్యే అదితి అభినందనలు



విజయనగరం (చైతన్యరథం): మండలం మలిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని అంబటి సాయి వైష్ణవి "రిమోట్ స్లీప్ మానిటరింగ్ అండ్ మెడికల్ అలారం సిస్టమ్"ను రూపొందించింది. ఈ సందర్భంగా విద్యార్థిని శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజును కలిశారు. ఈ సిస్టమ్ వృద్ధులు, రోగుల ఆరోగ్య భద్రతకు ఉపయోగపడుతుందని, నిద్ర సమయంలోనే గుండె స్పందన, ఆక్సిజన్ స్థాయిలను పర్యవేక్షిస్తూ, అసాధారణ పరిస్థితుల్లో అలారం ద్వారా హెచ్చరించే ఈ వినూత్న ప్రాజెక్టు విద్యార్థినిలోని సృజనాత్మకత, సామాజిక బాధ్యతకు నిదర్శనం అని ఆమె అన్నారు. విద్యార్థినికి మార్గదర్శకత్వం అందించిన గైడ్ టీచర్ సుబ్రహ్మణ్యం, ప్రోత్సహించిన ప్రధానోపాధ్యాయురాలు సుజాతకు అభినందనలు తెలిపారు. చిన్న వయసులోనే సమాజానికి ఉపయోగపడే ఆలోచనతో ముందుకొచ్చిన అంబటి సాయి వైష్ణవికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.



పెదవాళ్తేరు, మునసబ్ వారి వీధికి చెందిన పిల్లి నరసింగరావుకు సీఎంఆర్ఎఫ్ 22,976/ రూపాయలు చెక్కును ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు అందజేశారు. సదరు కార్యక్రమంలో వెలగపూడి ప్రతాప్ రుద్ర బైరెడ్డి రాజ్యలక్ష్మి పోతన రెడ్డి, 25వ వార్డు కార్పొరేటర్, కె శివారెడ్డి పి.మురళి మూర్తి యాదవ్, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





రాజా సాహెబ్ డాక్టర్ పీవీజీ రాజు వర్ధంతి సందర్భంగా క్షత్రియ పరిషత్, క్షత్రియ యూత్ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీలో పాల్గొన్న శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు

పెట్టుబడుల గమ్యస్థానంగా ఏపీ



రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్

తిరుపతి (చైతన్యరథం): పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామి గమ్యస్థానంగా నిలుస్తోందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారం, మంత్రి నారా లోకేష్ చొరవతో రాష్ట్రం విధ్వంసం నుంచి వికాసం వైపు వేగంగా అడుగులు వేస్తోందన్నారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖపట్నంలో నవంబర్ 12, 13 తేదీల్లో జరిగిన 31వ సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కీలక వేదికగా నిలిచిందని నరసింహ యాదవ్ తెలిపారు. ఈ సదస్సులో మొత్తం 303 ఒప్పందాలు కుదిరాయని, వాటి ద్వారా రూ.9.89 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఈ ఒప్పందాల ద్వారా రాష్ట్ర యువతకు సుమారు 3,48,309 ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు.

పెట్టుబడుల వెల్లువ.. ప్రాజెక్టుల పురోగతి

2024 జూన్ నుంచి రాష్ట్రానికి మొత్తం రూ.32.49 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే 526 ప్రాజెక్టులకు భూమి, ప్రోత్సాహకాలు మంజూరయ్యాయని, 303 ప్రాజెక్టులు నిర్మాణ దశకు చేరుకున్నాయని వివరించారు. 58 దేశాల ప్రతినిధులు, 15 మంది విదేశీ మంత్రులు, కేంద్ర మంత్రులు సదస్సుకు హాజరుకావడం ఆంధ్రప్రదేశ్‌పై అంతర్జాతీయ పెట్టుబడిదారుల్లో ఉన్న ఆసక్తిని తెలియజేస్తోందన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్, కియా ఇండియా, హీరో మోటోకార్ప్, హైపర్‌స్కేల్ డేటా సెంటర్లు, క్లీన్‌మాక్స్, సయంట్ తదితర సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు రావడం పారిశ్రామిక రంగానికి కొత్త అవకాశాలను తెస్తుందని చెప్పారు. ఏఐ డేటా సెంటర్లు, సెమీకండక్టర్లు, ఏరోస్పేస్, రక్షణ, గ్రీన్ ఎనర్జీ, పెట్రోకెమికల్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో ఏపీ గ్లోబల్ హబ్‌గా ఎదిగే అవకాశాలున్నాయని అభిప్రాయపడ్డారు.

మంత్రి లోకేష్ చొరవతో పెట్టుబడుల వెల్లువ

మంత్రి నారా లోకేష్ కృషితో ఒక్కరోజులోనే 24 కంపెనీలతో రూ.1.05 లక్షల కోట్ల ఒప్పందాలు జరిగాయని నరసింహ యాదవ్ తెలిపారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. పెట్టుబడిదారులకు వేగంగా అనుమతులు కల్పించే 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని, ఐదు రోజుల్లో 13 రకాల అనుమతులు ఇచ్చే విధానం ద్వారా పారిశ్రామికవేత్తలకు వెసులుబాటు కల్పిస్తోందన్నారు. పెట్టుబడిదారులకు రక్షణ కల్పించే ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలనే ఆలోచన కూడా ఉందని చెప్పారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించి ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను, ఒక ఏఐ నిపుణుడిని తయారు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. 2024 జూన్ నుంచి 714 ప్రాజెక్టులకు సంబంధించి రూ.22.6 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని, వాటి ద్వారా 19.3 లక్షల మందికి ఉపాధి లభించే అవకాశం ఉందని తెలిపారు.

అంతరిక్ష, రక్షణ పరిశ్రమల రాకకు అవకాశం

శ్రీహరికోటకు సమీపంలో 5,000 ఎకరాలు కేటాయించి ప్రైవేట్ అంతరిక్ష, రక్షణ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని నరసింహ యాదవ్ పేర్కొన్నారు. అగ్నికూల్ కాస్మోస్, హాథోర్ రాకెట్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి సంస్థలు ఈ రంగంలో ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. ఆర్‌పీఎస్‌జీ గ్రూప్ ఎండీ శాశ్వత్ గోయెంకాతో జరిగిన సమావేశంలో ఫస్ట్‌సోర్స్ సంస్థ కార్యకలాపాలను తిరుపతికి విస్తరించే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరినట్లు వెల్లడించారు. పారిశ్రామిక, పర్యాటక అవసరాల దృష్ట్యా విశాఖపట్నం నుంచి తిరుపతి మీదుగా బెంగళూరుకు వందేభారత్ స్లీపర్ రైలు ఏర్పాటు ప్రతిపాదనపైనా సదస్సు సందర్భంగా కేంద్రంతో సానుకూల చర్చలు జరిగాయని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పారిశ్రామికవేత్తల్లో నెలకొన్న ఆందోళనల కారణంగా రాష్ట్రానికి పెట్టుబడులు తగ్గాయని నరసింహ యాదవ్ విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో విశాఖపట్నం పెట్టుబడులు, పారిశ్రామిక కార్యకలాపాలకు కీలక కేంద్రంగా ఎదుగుతోందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులు, ఉపాధి అవకాశాల కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు.



చిరకాల స్వప్నం సున్నిపెంటకు గ్రామస్థాయి హోదా సాకారం

ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి హర్షం

శ్రీశైలం (చైతన్యరథం): తన తండ్రి హయాం నుంచి సున్నిపెంటకు గ్రామస్థాయి హోదా రావాలనే ఆరవై సంవత్సరాల చిరకాల స్వప్నం నేడు సాకారమైందని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శ్రీశైలం రెడ్ల కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సున్నిపెంట గ్రామంలో నివసిస్తున్న వారికి సంపూర్ణ గ్రామాధికారాలు, హక్కులు కలిగిలేకపోవడం బాధాకరమని అన్నారు. గతంలోనూ టీడీపీ హయాంలోనే గ్రామపంచాయతీగా ప్రకటించినప్పటికీ వైసీపీ ప్రభుత్వం ఇక్కడి ప్రజల సంక్షేమానికి ఏమాత్రం తోడ్పాటునందించలేదని అన్నారు. ప్రస్తుతం 10వేలకుపైగా జనాభా కలిగి ఉండి 14 వార్డులు ఉన్న సున్నిపెంట గ్రామానికి ఎన్నికలు నిర్వహించాలని నోటిఫికేషన్ విడుదలైందని అన్నారు. అదే విధంగా ఎన్నికలు ఏకగ్రీవమైతే గ్రామాభివృద్ధి రెట్టింపు అవుతుందన్నారు. సున్నిపెంట అభివృద్ధికి ఆటంకం కలిగిస్తూ ప్రభుత్వానికి అనవసరమైన పిటీషన్లు పెట్టి కోర్టును తప్పుదోవ పట్టిస్తూ ప్రజా సంక్షేమాన్ని మరింత వెనక్కి నెట్టే వారు తమ చర్యలు మానుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో మండలాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, రమణ, సుబ్బారెడ్డి, వట్టి వెంకటరెడ్డి, గెల్లి వెంకటేశ్వర్లు, మక్బుల్, జిలాని, సుభాని, మహమ్మద్ భాషా, పాపారావు పాల్గొన్నారు.



మెరుగవుతున్న రాప్తాడు బాలిక ఆరోగ్యం : మంత్రి సత్యకుమార్

విజయవాడ (చైతన్యరథం): రాప్తాడు బాధితురాలి ఆరోగ్య పరిస్థితి రోజురోజుకూ మెరుగుపడుతోందని ఏపీ వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాప్తాడు బాధితురాలి ఆరోగ్య పరిస్థితిపై మంత్రి సత్యకుమార్ స్పందించారు. 'బాధితురాలి రక్తహీనత సమస్య తగ్గుముఖం పడుతోంది. హీమోగ్లోబిన్ స్థాయి 9.5కు చేరింది. గతంలో 174గా ఉన్న సీఆర్‌పీ స్థాయి ప్రస్తుతం 46. 38కు చేరింది. వెంటిలేటర్ సహాయం లేకుండానే ఆక్సిజన్‌ను తీసుకుంటోంది. వైద్యుల సహాయంతో నెమ్మదిగా నడుస్తోంది. నొప్పి, ఆందోళనను తగ్గించేందుకు వైద్యులు మందులతో పాటు ఫిజియోథెరపీని కూడా చేయిస్తున్నారు' అని మంత్రి సత్యకుమార్ బాలిక ఆరోగ్య పరిస్థితిని వెల్లడించారు.

నిందితుడు హేమంత్ ఆరోగ్యం కూడా...

ఇదిలావుండగా రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రాప్తాడు బాలిక కేసులో నిందితుడు హేమంత్ ఆరోగ్య పరిస్థితిపై తాజా సమాచారాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. వేంకటేశ్వర్లు వెల్లడించారు. రాప్తాడు హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బాలికపై రంపంతో దాడి చేసిన కేసులో నిందితుడు హేమంత్ ఆరోగ్యపరిస్థితి నిలకడగానే ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ వెల్లడించారు. హేమంత్‌కు ఆయాసం ఉన్నప్పటికీ.. ప్రస్తుతం తగ్గిందన్నారు. నిందితుడికి 24 గంటల పాటు నిరంతర పర్యవేక్షణలో చికిత్స అందించాలని వైద్యులకు ఆదేశించినట్లు సూపరింటెండెంట్ డా. వేంకటేశ్వర్లు తెలిపారు. కాగా.. పోలీసుల ఎదురుకాల్పుల్లో తీవ్రంగా గాయపడిన నిందితుడి.. కుడి కాలును వైద్యులు శస్త్ర చికిత్స తొలగించిన సంగతి తెలిసిందే.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మెకనైజేషన్‌తో వంటశాల ఆధునికీకరణ

దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశం

శ్రీకాళహస్తి (చైతన్యరథం): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని వంటశాలలను మెకనైజ్‌డ్ విధానంతో ఆధునికీకరించాలని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశించారు. ఆలయంలోని దక్షిణ గోపురానికి అనుకుని ఉన్న నైవేద్యం పోటులో అగ్నిప్రమాదం సంభవించిన నేపథ్యంలో మంత్రి పోటును పరిశీలించి ప్రమాదంపై సిబ్బందిని ఆరా తీశారు. నెయ్యి, నూనెను నిర్దిష్టమైన ఉష్ణోగ్రతతోనే వేడి చేయాలని సూచించారు. ప్రసాదాలను భక్తుల రద్దీకి అనుగుణంగా ఒకట్రెండు రోజుల ముందుగా మాత్రమే సిద్ధం చేసుకోవాలన్నారు.పోటులో చుట్టూ నూనె, నెయ్యి నుంచి వచ్చే జిడ్డు వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. ఇంత పెద్ద ఆలయంలో ఇప్పటివరకు మెకనైజ్‌డ్ వంటశాలలు ఎందుకు ఏర్పాటు చేయలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆలయంలోని వంటశాలలను పెరిగిన భక్తుల రద్దీకి అనుగుణంగా విస్తరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన ఆగమ సలహాలను అందించేందుకు స్తపతులను, ఇంజనీర్లను పంపుతామని తెలిపారు. ఇక ప్రమాదం సంభవించిన సమయంలో ఫైర్ ఎస్టింగిషర్ ఎందుకు ఆన్ కాలేదని నిలదీశారు.ఇంత పెద్ద ఆలయంలో ఫైర్ సేఫ్టీ వ్యవస్థను ఎందుకు ఏర్పాటు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికార యంత్రాంగం పనితీరును మెరుగుపరచుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలైనప్పటికీ ముక్కంటి ఆలయ నిర్వహణపై భక్తుల నుంచి 72శాతం మించి సంతృప్తి వ్యక్తం కాకపోవడం బాధాకరమన్నారు. అంతకు ముందు మంత్రి స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.

ఆలయ చైర్మన్ కొట్టే సాయి, ఈవో బీకే వెంకటేశులు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ తదితరులు ఆయన వెంట వున్నారు.





సీలేరులో డ్యాం సేఫ్టీ నిపుణుల పర్యటన

నాణ్యతపై త్వరలో కేంద్ర ప్రభుత్వానికి ఇంజనీర్ల నివేదిక

విశాఖపట్టణం (చైతన్యరథం): సీలేరు కాంప్లెక్సు పరిధిలోని ఎగువ సీలేరులో డ్యాం సేఫ్టీ నిపుణుల బృందం పర్యటించింది. కేంద్ర కమిటీ ఆదేశాల మేరకు 60 సంవత్సరాలు పైబడిన సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డ్యాంలు, పటిష్టత, వాటి స్థితిగతులపై నివేదికను అందించాలన్న ఆదేశాల మేరకు రాష్ట్ర డ్యాం సేఫ్టీ అథారిటీ చైర్మన్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిపుణుల కమిటీ సభ్యులు బీ చంద్రశేఖర్, ఈవీఎస్ఈ వరప్రసాద్ సీలేరులో రెండురోజుల పాటు పర్యటించి జలవిద్యుత్ కేంద్రానికి నీరందించే గుంటవాడ మెయిన్, రెగ్యులేటర్ డ్యాం, ప్రధాన ఆనకట్టలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీలేరు గుంటవాడ మెయిన్, డ్యాం గేట్లు, గ్యాలరీ, ఎర్త్ డ్యాం, ఇతర సివిల్ స్ట్రక్చర్లను, జనరేటర్‌లను స్థానిక జెన్‌కో ఇంజనీర్లతో కలసి బృంద సభ్యులు పరిశీలించారు. డ్యాం గేట్లు స్థితిగతులు, ఎక్కడెక్కడ లీకేజీలు ఉన్నాయి.. తదితర అంశాలను ఈ బృందం క్షుణ్ణంగా పరిశీలన చేసి నివేదికను తయారు చేస్తారు. ఈ నివేదికను కేంద్ర కమిటీకి అందజేసిన తర్వాత డ్యాంల లైఫ్‌ను పెంచేందుకు ఎటువంటి చర్యలు చేపట్టాలనే అంశాలను కేంద్ర కమిటీ ఏపీ జెన్‌కో ఉన్నతాధికార్లకు ఆదేశాలు జారీ చేస్తుంది. ఈమేరకు జెన్‌కో ఉన్నతాధికారులు కేంద్ర కమిటీ సూచనలు, సలహాల మేరకు చర్యలు చేపడతారు. ఈ కార్యక్రమంలో సీలేరు కాంప్లెక్సు సూపరింటెండెంట్ ఇంజనీర్ జాకీర్ హూస్సేన్, ఏడీఈ జయపాల్, ఏఈఈ సురేష్ పాల్గొన్నారు.

నవులూరులో వైసీపీ నవ్వులపాలు

మంత్రి లోకేష్ నాయకత్వంలో అభివృద్ధికి ఆకర్షితులై టీడీపీలో చేరిన 50 కుటుంబాలు

మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 38వ డివిజన్ నవులూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 50 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు. నవులూరుకు చెందిన కీలక వైసీపీ నాయకుడు అదం షఫీతో పాటు సుమారు 50 కుటుంబాలు మంగళగిరి నియోజకవర్గ టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎంఎస్ఎస్ భవన్‌లో టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో షేక్ రియాజ్, షేక్ మహబూబ్, సుంకర ముత్యం, షేక్ బషీర్, దొడ్డాకుల చంద్రశేఖర్, చక్రాల రామరాజు, షేక్ సాజిద్, దొడ్డాకుల వాసు, షేక్ ఖయ్యుమ్, ముప్పాళ్ళ సీతయ్య, షేక్ పర్వేజ్, దొడ్డాకుల నాగేశ్వరరావు, షేక్ ఖాసీంబి, పఠాన్ ఫాతిమాబి, షేక్ నసీమ, నూతక్కి లక్ష్మి నరసింహ, బొజ్జాగాని శ్రీజ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నవులూరుకు చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



శ్రీకాళహస్తి ఆలయంలో స్పై కెమెరా కలకలం

శ్రీకాళహస్తి (చైతన్యరథం): ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి ఆలయంలో స్పై కెమెరా కళ్లజోడు కలకలం రేపింది. కెమెరా అమర్చిన కళ్లజోడుతో పుణెకు చెందిన ఓ భక్తుడు ఆలయంలోకి ప్రవేశించాడు. అమ్మవారి ఆలయంలో కళ్లజోడును అక్కడి పూజారులు గుర్తించారు. వెంటనే ఎస్పీఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు. సదరు వ్యక్తి పుణెకు చెందిన అంకేష్ అగర్వాల్‌గా భద్రతా సిబ్బంది గుర్తించారు. ఆ భక్తుడు కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారి దర్శనానికి వచ్చిన సమయంలో అతడి కళ్లకు కెమెరా కళ్లజోడు ఉండటాన్ని పూజారులు గుర్తించారు. పూజారులు ఇచ్చిన సమాచారం మేరకు భక్తుడిని అదుపులోకి తీసుకున్న ఎస్పీఎఫ్ సిబ్బంది విచారణ చేపట్టారు. అంకేష్ అగర్వాల్ రూ. 5వేలు చెల్లించి రాహుకేతు పూజ చేయించుకున్నాడు. అనంతరం స్వామి వారి దర్శనం చేసుకున్నాడు. ఈ క్రమంలో స్వామివారి ఆలయంలోనూ వీడియోలు తీశారా అనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఆలయ గర్భగుడి, ప్రాంగణాల్లో ఫొటోలు, వీడియోలు తీయడం పూర్తి నిషేధం. భద్రతా కారణాల దృష్ట్యా ఇలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఆలయంలోకి అనుమతించరు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఆలయ అధికారులు, పోలీసులు హెచ్చరించారు.



మంగళగిరి శాఖా గ్రంథాలయంలో ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరి శాఖా గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ వారోత్సవాలను పురస్కరించుకుని తొలిరోజు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవ వేడుకలతో పాటు విద్యార్థులకు దేశభక్తి గేయాల పోటీలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో జూనియర్స్ (7వ తరగతి లోపు), సీనియర్స్ (7 నుంచి 10వ తరగతి వరకు) విభాగాలుగా విద్యార్థులకు దేశభక్తి గేయాల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంగళగిరి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కె. వెంకటేశ్వర్లు హాజరయ్యారు. వివేకానంద్ (స్టేట్ కోఆర్డినేటర్, ఆంధ్రప్రదేశ్ విజ్ఞాన భారతి) న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి శాఖా గ్రంథాలయ అధికారి మల్లంపాటి సీతారామయ్య అధ్యక్షత వహించారు. గ్రంథాలయ సిబ్బంది ఎన్. ఆరోగ్యం, కృష్ణ, సుబ్బారావు, అబ్దుల్ అహ్మద్ కార్యక్రమ నిర్వహణలో చురుకుగా పాల్గొని వేడుకలు విజయవంతం కావడానికి సహకరించారు. నవంబర్ 20వ తేదీ వరకు జరిగే ఈ వారోత్సవాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠకులు, స్థానిక ప్రముఖులు పాల్గొనేలా వివిధ సాహిత్య, సాంస్కృతిక, విజ్ఞాన సంబంధిత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలి

గొల్లపూడి సర్పంచ్ అభ్యర్థి జయంత్ సాయికి దేవినేని మాజీ మంత్రి దేవినేని ఉమా మద్దతు

గొల్లపూడి (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామ సర్పంచ్ పదవికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొమ్మసాని సుబ్బారావు గారి కుమారుడు బొమ్మసాని జయంత్ సాయి, 20 వార్డులకు పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులు, స్థానిక నాయకులు నేడు గొల్లపూడిలోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి బొమ్మసాని జయంత్ సాయిని దేవినేని ఉమా దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే 20 వార్డుల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దేవినేని ఉమా మాట్లాడుతూ గొల్లపూడి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లి, రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పన, పారిశుధ్యం, తాగునీరు, రహదారుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, గ్రామాభివృద్ధికి నిరంతరం అందుబాటులో ఉండే నాయకత్వాన్ని ప్రజలకు అందించాల్సిన బాధ్యత అభ్యర్థులపై ఉందన్నారు. ఎన్నికల్లో వ్యక్తిగత విభేదాలకు తావులేకుండా నాయకులు, కార్యకర్తలు, కూటమి శ్రేణులంతా సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. గొల్లపూడి గ్రామంలో సర్పంచ్ అభ్యర్థితో పాటు 20 వార్డుల కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని దేవినేని ఉమా పిలుపునిచ్చారు.





రంపచోడవరం సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు

కూటమి నాయకులతో కుడుపూడి సత్తిబాబు, ఎమ్మెల్యే మిర్యాల శిరీష సమావేశం

రంపచోడవరం (చైతన్యరథం): పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో సర్పంచ్ అభ్యర్థుల విషయమై కూటమి నాయకులతో పోలవరం జిల్లా ఎన్నికల అబ్జర్వర్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి సమావేశమయ్యారు. జిల్లాలోని 12 మండలాల పరిధిలో ఉన్న 186 గ్రామ పంచాయతీల్లో కూటమి తరఫున పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థుల విషయమై చర్చించారు. అన్ని గ్రామ పంచాయతీల్లో కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులంతా సమన్వయంతో, సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ జిల్లా ఇన్‌చార్జి పుల్లా రాజశేఖర్ రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు బుల్లి కొండల దొర, మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, సీతంశెట్టి వెంకటేశ్వరరావు, బాబు రమేష్, మండల అధ్యక్షులు, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

గూడూరు మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం

పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్, చేజెర్ల వెంకటేశ్వరరెడ్డి, డూండీ రాకేశ్



గూడూరు (చైతన్యరథం): ఈనెల 26 వ తేదీ జరగనున్న గూడూరు మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం గూడూరు లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా నెల్లూరు జిల్లా టీడీపీ ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు. గూడూరు నియోజకవర్గంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ఘన విజయం సాధించినందుకు శాసనసభ్యులు ను,పార్టీ నాయకులను అభినందించారు. శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ జిల్లా పరిశీలకులు డూండీ రాకేశ్, నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని 48 వార్డులకు సంబంధించి టీడీపీ నాయకులతో వార్డుల వారీగా అభిప్రాయ సేకరణ జరిపారు. అదేవిధంగా బీజేపీ,జనసేన నాయకులతో కూడా చర్చలు జరిపారు. ఈ సమావేశంలో గూడూరు పట్టణ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





పొదిలి కోటపై జయకేతనం ఎగరాలి

కూటమి శ్రేణులకు ఎమ్మెల్యే కందుల పిలుపు

మార్కాపురం (చైతన్యరథం): పొదిలి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా శనివారంమార్కాపురం శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి పొదిలి పట్టణంలోని పొదిలి పట్టణ కూటమి ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మార్కాపురం జిల్లా పరిశీలకులు మరియు ఎమ్మెల్సీ బీటి నాయుడు విచ్చేసి నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ మొన్న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మార్కాపురం నియోజకవర్గంలోని నాలుగుకు నాలుగు జడ్పీటీసీలు 49 ఎంపీటీసీలుగాను 41 ఎంపీటీసీలు గెలుపొంది చరిత్ర సృష్టించామని అన్నారు. ఇదే వరవడిని వచ్చే పొదిలి మున్సిపల్ ఎన్నికల్లో చూపించాలని కూటమి 28 వార్డుల్లో విజయం సాధించాలని దానికి కాను ప్రతి వార్డ్ నాయకులు కార్యకర్తలు శక్తి వంచన లేకుండా పనిచేయాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సుగవాసికి శుభాకాంక్షల వెల్లువ

రాయచోటి (చైతన్యరథం): గాలివీడు మండల జడ్పీటీసీ ఎన్నికల్లో రాష్ట్రస్థాయిలోనే రికార్డు స్థాయి అత్యధిక మెజారిటీతో చారిత్రాత్మక విజయం సాధించిన రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, జడ్పీటీసీ సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబును,



మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా ఇరువురు నాయకులు ఆత్మీయంగా పలకరించుకుని, శాలువాలతో పరస్పరం సత్కరించుకున్నారు. సుగవాసి ప్రసాద్ బాబు సాధించిన చారిత్రాత్మక విజయంపై ఎమ్మెల్యే షాజహాన్ బాషా ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు. గాలివీడు మండల ప్రజలు చూపించిన అపారమైన అభిమానం, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషి, కూటమి శ్రేణుల ఐక్యతకు ఈ ఘన విజయం నిదర్శనంగా నిలిచిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తన విజయానికి అండగా నిలిచిన గాలివీడు మండల ప్రజలకు, టీడీపీ కూటమి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు సుగవాసి ప్రసాద్ బాబు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, గాలివీడు మండల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని స్పష్టం చేశారు.



సర్పంచ్ ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సమాయత్తం

పటిష్ట కార్యాచరణకు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి దిశానిర్దేశం

గిద్దలూరు (చైతన్యరథం): గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో గిద్దలూరు నియోజకవర్గంలో రాజకీయ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ, రాబోయే సర్పంచ్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామ పంచాయతీలో స్థానిక పరిస్థితులు, ప్రజల అభిప్రాయాలు, అభ్యర్థుల ప్రజాదరణను పరిగణనలోకి తీసుకొని సమర్థులైన అభ్యర్థులను ఎంపిక చేయాలని సూచించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతి గ్రామంలో నాయకులు, కార్యకర్తలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ఎన్నికల కార్యాచరణను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.ఆరు మండలాల పరిధిలోని ప్రతి గ్రామ పంచాయతీపై ప్రత్యేక దృష్టి సారించి, నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో ప్రజల సమస్యల పరిష్కారం, గ్రామాల అభివృద్ధి కోసం పనిచేయాలని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పిలుపునిచ్చారు.



అభివృద్ధి సాధనకు సమష్టి కృషి

ఎమ్మెల్యే ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి



నెల్లూరు (చైతన్యరథం): రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మరియు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఒక్క జడ్పీటీసీ, 12 ఎంపీటీసీ లలో ఘనవిజయం అందించిన నెల్లూరు రూరల్ ప్రజలకు, కష్టం చేసిన నాయకులకు, కార్యకర్తలకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత ఎన్నికల్లో తనకు వచ్చిన ఓట్లకంటే అత్యధిక ఓట్లతో స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్పొరేటర్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీలు విజయం సాధించారన్నారు. ఈ విజయాన్ని చూసి పొంగిపోకండా ఇంకా బాధ్యతాయుతంగా పనిచేస్తామన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో నగర కార్పొరేషన్, గ్రామీణ ప్రాంతాలలో చిన్నపాటి గొడవలు లేకుండా ప్రత్యర్థి వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ సైతం ఇది తప్పు అని ప్రశ్నించలేని విధంగా పారదర్శకంగా ఎన్నికలు జరిగాయన్నారు. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. అందరిని కలుపుకొని ప్రజల ఆశీస్సులతో నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని ఇంకా అభివృద్ధి చేస్తామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వెల్లడించారు.

పంచాయతీ పోరుకు పకడ్బందీ వ్యూహం

అభ్యర్థుల ఎంపికపై ఎమ్మెల్యే పరిటాల సునీత ముమ్మర కసరత్తు, మర్యాదపూర్వకంగా కలిసిన రాప్తాడు జడ్పీటీసీ జయలక్ష్మి



రాప్తాడు (చైతన్యరథం): నియోజకవర్గంలో జరగనున్న పంచాయతీ ఎన్నికలలో విజయమే లక్ష్యంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై కసరత్తును మరింత వేగవంతం చేశారు. శనివారం అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంతో పాటు రామగిరి మండలం వెంకటాపురంలోనూ ఆయా మండల, గ్రామ స్థాయి ముఖ్య నాయకులతో గ్రామాల వారీగా సమావేశమై చర్చలు జరిపారు. నియోజకవర్గ పరిధిలోని అనంతపురం రూరల్, ఆత్మకూరు, రాప్తాడు, రామగిరి, కనగానపల్లి మరియు చెన్నేకొత్తపల్లి మండలాలలోని పంచాయతీలకు సంబంధించి సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై నాయకులతో చర్చించారు. ఈ సమావేశాలలో అభ్యర్థుల ఎంపికకు సంబంధించి పలు కీలక అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. ప్రధానంగా ఆయా పంచాయతీల రిజర్వేషన్లను బట్టి రేసులో ఎవరెవరు ఉన్నారు, క్షేత్రస్థాయిలో ఎవరైతే బలమైన అభ్యర్థి అవుతారు అనే దానిపై ఆరా తీశారు. అంతేకాకుండా గత ఐదేళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన విధేయత, నాయకుల సీనియారిటీతో పాటు పార్టీలో ఉత్సాహంగా పనిచేస్తున్న యువతకు అవకాశం కల్పించే అంశాలపై కూడా చర్చించి అభిప్రాయాలు సేకరించారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ, పార్టీలో ఎక్కడా విభేదాలకు తావులేకుండా బలమైన అభ్యర్థులను బరిలోకి దింపేలా ఎమ్మెల్యే సునీత దిశానిర్దేశం చేశారు. అంతకుముందు, ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో రాప్తాడు మండల జడ్పీటీసీగా ఘనవిజయం సాధించిన జయలక్ష్మి అనంతపురం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీతని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జయలక్ష్మి గారిని ఎమ్మెల్యే అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు మనపై ఎంతో నమ్మకంతో పెట్టిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి, నిరంతరం ప్రజాసేవలో భాగమవ్వాలని సూచించారు. ఈ సమావేశాలలో ఆరు మండలాలకు చెందిన తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





కార్యకర్తలకు అండగా టీడీపీ

కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం (చైతన్యరథం): కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రతి కార్యకర్త నా కుటుంబ సభ్యులేనని వారికి కష్టం వస్తే అండగా నిలబడతానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు నాయకులు, కార్యకర్తలకు భరోసా ఇచ్చారు..స్థానిక ఎన్నికల సమయంలో వైసీపీ ముష్కర మూకలు టీడీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడి దారుణంగా కొట్టడంతో తీవ్రంగా గాయడిన చాపిరి మల్లికార్జునను పరమార్శించి ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. అనంతరం నాగరాజు ఇంటి దగ్గరకు వెళ్లి వారిని పలకరించి పక్కనే ఉన్న యల్లమ్మ, చిత్రలింగేశ్వర స్వామి వారి ఆలయానికి వెళ్లి దర్శించుకున్నారు.



రూ.లక్ష కోట్లతో గ్లోబల్ హార్టీకల్చర్ హబ్‌గా రాయలసీమ

రాయలసీమ ప్రాంతాన్ని రూ.లక్ష కోట్లతో గ్లోబల్ హార్టీకల్చర్ హబ్‌గా మార్చబోతున్నామని దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 40వేల కోట్లు, కేంద్ర ప్రభుత్వం పీపీపీ మోడల్‌లో మరో రూ. 60వేల కోట్లు తీసుకురావడం జరుగుతోందన్నారు. మదనపల్లిలో రిలయన్స్ భాగస్వామ్యంతో ప్రతిష్టాత్మక హార్టీకల్చర్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నాన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు ఒక్క డ్రిప్ లేదా స్ప్రింక్లర్ కూడా ఇవ్వలేదని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 300 కోట్లతో డ్రిప్పులు, స్ప్రింకర్లను రైతులకు అందించామన్నారు. రాయలసీమ ప్రాంతానికి గతంలో ఎప్పుడూ లేని విధంగా పెట్టుబడులు వస్తున్నాయన్నారు. చిత్తూరు జిల్లాకు ప్రసిద్ధ రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ ఫ్యాక్టరీని తీసుకొచ్చామన్నారు. అలాగే వేల కోట్ల పెట్టుబడులతో విండ్, సోలార్ పవర్ ప్రాజెక్టులు వస్తున్నాయన్నారు. పుట్టపర్తికి యుద్ధ విమానాలు తయారు చేసే డిఫెన్స్ పరిశ్రమను తీసుకొచ్చామన్నారు. అనంతపురం జిల్లాలో రూ. లక్ష కోట్ల పెట్టుబడులతో భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించబోతున్నారన్నారు. గతంలో సీఎం చంద్రబాబు కియా మోటార్స్ తెచ్చి 50వేల మందికి ఉద్యోగ,ఉపాధి కల్పించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

సీఎం చంద్రబాబు సంకల్పబలంతోనే సీఐఐ అంతర్జాతీయ భాగస్వామ్య సదస్సు విజయవంతం

అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వెల్లడి



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖ నగరంలో రెండు రోజుల పాటు ఘనంగా జరిగిన సీఐఐ అంతర్జాతీయ భాగస్వామ్య సదస్సు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్, పాలనాదక్షతకు నిదర్శనమని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుభవం, దార్శనికతకు, యువ నాయకుడు ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కార్యాచరణ తోడవడంతో అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. విశాఖ సీఐఐ సదస్సు ద్వారా సుమారు రూ. 9.89 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదరడం రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి గొప్ప ముందడుగు అని అన్నారు. ఈ పెట్టుబడుల ద్వారా లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయని, రాష్ట్రంలో పారిశ్రామిక రంగం కొత్త పుంతలు తొక్కనుందని పేర్కొన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, వేగవంతమైన అనుమతులు, పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ భరోసా వంటి అంశాలు ఏపీని పెట్టుబడులకు అత్యంత అనుకూల రాష్ట్రంగా నిలబెడుతున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు యువతకు 25 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందన్నారు. పరిశ్రమల స్థాపనతో పాటు నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ యువతకు మెరుగైన భవిష్యత్తును అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. అనంతపురం జిల్లాలోనూ రక్షణ రంగ పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కీలకమని ఎమ్మెల్యే దగ్గుపాటి పేర్కొన్నారు. పరిశ్రమలు వస్తే స్థానిక యువతకు ఉద్యోగాలు, వ్యాపారులకు ఉపాధి, రైతులకు అనుబంధ రంగాల్లో ఆదాయం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని, రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిన్నదని విమర్శించారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన అనుభవంతో రాష్ట్రానికి మళ్లీ పెట్టుబడుల విశ్వాసాన్ని తీసుకొస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదని హితవు పలికారు. విద్యారంగంలోనూ కూటమి ప్రభుత్వం సమూల సంస్కరణలు చేపడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో పెట్టి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేశారని, విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించిన జగన్ రెడ్డి పాలనను ప్రజలు మరచిపోలేరని విమర్శించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావడం అంటే కేవలం పారిశ్రామిక అభివృద్ధి మాత్రమే కాదు.. లక్షలాది కుటుంబాలకు ఉపాధి, ఆర్థిక భరోసా కల్పించడం కూడా ఆయన సంకల్పానికి నిదర్శనమన్నారు. సంపద సృష్టించి ఆ ఫలాలను పేదలకు అందించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పానికి విశాఖ సీఐఐ సదస్సు నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తూ యువతకు ఉజ్వల భవిష్యత్తును అందిస్తుందని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు.



తెలుగు ఫొటోగ్రాఫర్ నరసింహ గౌడ్‌కు బ్రిటన్ పార్లమెంటులో

అరుదైన గౌరవం

'బెస్ట్ ఫొటోగ్రాఫర్ ఇన్ తమిళ్ కమ్యూనిటీ-2026' అవార్డు ప్రదానం

లండన్: తెలుగు కమ్యూనిటీకి చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ వై.జ్వాలా నరసింహ గౌడ్‌కు బ్రిటన్ పార్లమెంటు వేదికగా అరుదైన గౌరవం దక్కింది. లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ బ్రిటన్ పార్లమెంట్‌లో నిర్వహించిన 'ఫెడరేషన్ ఆఫ్ బ్రిటిష్ తమిళ్ అసోసియేషన్స్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్-2026' కార్యక్రమంలో ఆయన ఫొటోగ్రఫీ రంగానికి అందించిన సేవలను గుర్తించిన ఆ సంస్థ 'బెస్ట్ ఫొటోగ్రాఫర్ ఇన్ తమిళ్ కమ్యూనిటీ-2026' అవార్డుతో సత్కరించింది. ఈ ప్రతిష్టాత్మక అవార్డును డిప్యూటీ మేయర్ జాన్ గ్రే, బ్రిటన్ ప్రభుత్వ మంత్రి, పార్లమెంట్ సభ్యుడు సర్ స్టీఫెన్ టిమ్స్ చేతులమీదుగా ఆయన అందుకున్నారు. భాషలు, ప్రాంతాలు, కమ్యూనిటీలకు అతీతంగా ప్రతిభను గుర్తించిన ఫెడరేషన్ ఆఫ్ బ్రిటిష్ తమిళ్ అసోసియే షన్స్ సంస్థకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కాగా జ్వాలా నరసింహగౌడ్ ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం ఐతవరం గ్రామానికి చెందిన వ్యక్తి కావడం విశేషం.

గాంధీజీ స్మారక స్థలిని సందర్శించిన ఎస్‌బీఐ చైర్మన్

మహాత్మునికి శ్రీనివాసులు శెట్టి నివాళి



డాలస్: అమెరికా పర్యటనలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి డాలస్ పరిసర ప్రాంతమైన ఇర్వింగ్ నగరంలో ఉన్న మహాత్మాగాంధీ స్మారక స్థలిని సందర్శించారు. గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ 18 ఎకరాల సువిశాల ఉద్యానవనంలో ఏర్పాటుచేసిన మహాత్మాగాంధీ విగ్రహం చూడముచ్చటగా ఉందన్నారు. విదేశాల్లో ఇంత భారీ విగ్రహ నిర్మాణం సాకారం కావడానికి కృషి చేసిన మహాత్మా గాంధీ మెమోరియల్ ట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ప్రసాద్ తోటకూర, కార్యవర్గ సభ్యుల కృషిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ మెమోరియల్ వ్యవస్థాపక కార్యదర్శి రావు కలవల, ఇండియా అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్ అధ్యక్షుడు మహేంద్రరావు, డాక్టర్ ప్రసాద్ తోటకూర..



శ్రీనివాసులు శెట్టికి స్మారక స్థలి ఆవరణ గురించి వివరించారు. 12ఏళ్లు పూర్తి చేసుకున్న స్మారకస్థలి కేవలం ప్రవాస భారతీయులకే కాకుండా అమెరికన్లకు సైతం యాత్రా స్థలంగా మారిందని తెలిపారు. డాక్టర్ ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ.. ఫ్రిస్కో నగరంలో ఇటీవల ఎస్‌బీఐ శాఖను ప్రారంభించడం సంతోషకరంగా ఉందన్నారు. సాధారణ బ్యాంకు ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించిన శ్రీనివాసులు శెట్టి... భారతదేశంలోనే అతి పెద్ద ప్రభుత్వరంగ బ్యాంకుకు చైర్మన్‌గా ఎదగడం ఎందరికో స్ఫూర్తిదాయకమని కొనియాడారు.



న్యూజెర్సీలో చిన జీయర్ స్వామికి

ఘన స్వాగతం

న్యూజెర్సీ: జీయర్స్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ యూఎస్ఏ ఆధ్వర్యంలో పూజ్య చిన జీయర్ స్వామికి న్యూజెర్సీలో స్థానిక కమ్యూనిటీ ప్రజలు ఘన స్వాగతం పలికారు. న్యూజెర్సీ లోని విల్లింగ్‌బోరో (494 Beverly Rancocas Rd, Willingboro, NJ 08046) వేదికగా ఈ నెల 17వ తేదీ వరకు స్వామి వారి 70వ తిరునక్షత్ర వేడుకలతో పాటు శ్రీసంజీవని హనుమాన్ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతాయి. భక్తులు వచ్చి స్వామివారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు. పూర్తి వివరాల కోసం jetnj.org వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

విదేశీ విద్యార్థులకు కెనడా షాక్

వలసలపై కఠిన నియంత్రణ దిశగా చర్యలు... ఏటా 1.5 లక్షల మందికే అనుమతి



కెనడా: వలస సమస్యలతో ఇబ్బంది పడుతున్న కెనడా కీలక నిర్ణయం తీసుకుంది. తాత్కాలిక వలసలపై కఠిన నియంత్రణ దిశగా చర్యలు చేపట్టిన అక్కడి ప్రభుత్వం.. విదేశీ విద్యార్థుల రాకపై పరిమితులు విధించింది. వచ్చే రెండేళ్ల పాటు ఏటా లక్షన్నర మంది విదేశీ విద్యార్థులను మాత్రమే తమ దేశంలోకి అనుమతించనుంది. విద్యా అవకాశాలు, శ్రామిక శక్తి అవసరాల్లో సమతుల్యత పాటించడంతో పాటు వసతి, ప్రజా సేవలపై ఒత్తిడి తగ్గించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు రెఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా (IRCC) వెల్లడించింది. కేవలం విద్యార్థులే కాదు.. ఇతర వలసదారుల సంఖ్యపైనా పరిమితి తీసుకొచ్చింది. తాజా నిర్ణయం ప్రకారం... 2027 నుంచి 2029 వరకు కెనడా ఏటా 3.7 లక్షల మంది చొప్పున తాత్కాలిక వలసదారులను తమ దేశంలోకి అనుమతించనుంది. ఇందులో 1.5 లక్షల మంది విదేశీ విద్యార్థులు కాగా... మిగతా 2.2 లక్షల వీసాలు తాత్కాలిక విదేశీ ఉద్యోగులకు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. ఈ ఏడాది కూడా కెనడా ఈ తరహా నిబంధనలను అమలు చేసింది. అయితే 2026కి 1.55 లక్షల మంది విదేశీ విద్యార్థులను అనుమతించింది. ఈ నిబంధనలు కెనడా రావాలనుకునే కొత్త వారికి మాత్రమే వర్తిస్తాయని ఆ దేశం స్పష్టం చేసింది. తాజా నిర్ణయంతో కెనడాకు వెళ్లాలనుకునే భారతీయ విద్యార్థులపై కొంత ప్రభావం పడే అవకాశం ఉంది. కెనడాలో ఇటీవల తాత్కాలిక వలసదారుల జనాభా విపరీతంగా పెరుగుతోంది. దీంతో స్వదేశీయుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. విదేశీయులు పెరగడం వల్ల వసతి సౌకర్యాలు అందుబాటులో ఉండట్లేదని, ప్రజా సేవలకు కూడా ఆటంకం కలుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వలసలపై కెనడా చర్యలు చేపట్టింది. ఇదిలా ఉండగా... ఆ దేశం ఏటా 2.44 లక్షల మందికి ఆర్థిక వలసల కేటగిరీ కింద శాశ్వత నివాస హోదా (PR) కల్పిస్తోంది.

22న 'నాట్స్' ఆధ్వర్యంలో

కొలరాడో సంబరాలు

అలరించనున్న సింగర్ కోటి లైవ్ కాన్సర్ట్

కొలరాడో: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (NATS) కొలరాడో చాప్టర్ ఆధ్వర్యంలో మన తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించే ఉద్దేశంతో 'కొలరాడో సంబరాలు-2026' నిర్వహించనున్నారు. ఈ నెల 22వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు Douglas County Fairgrounds, 500 Fairgrounds Road, Castle Rock, CO 80104 వేదికగా ఈ వేడుక నిర్వహించనున్నారు. స్థానిక కళాకారులను ప్రోత్సహించడంతో పాటు సామూహిక తెలుగు సంబరంగా ఈ కార్యక్రమాన్ని తీర్చిదిద్దుతున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు కోటి 50 వసంతాల సంగీత ప్రయాణాన్ని పురస్కరించుకుని ఆయన నేతృత్వంలో లైవ్ మ్యూజికల్ కాన్సర్ట్ ఏర్పాటు చేశారు. ఇది సంగీతాభిమానులకు ఒక అద్భుతమైన అనుభూతిని పంచనుంది. ఈ సంబరాలు ఒక చారిత్రక ఘట్టానికి సాక్ష్యంగా నిలవనున్నాయి. ఎలైట్ వరల్డ్ రికార్డ్స్ సాధనలో భాగంగా 500 మందికి పైగా సింగర్లతో 'మా తెలుగు తల్లికి' గీతాన్ని సామూహికంగా ఆలపించనున్నారు. 'ఒకే కుటుంబం, ఒకే గొంతు, ఒక చారిత్రక ఘట్టం' నినాదంతో ఈ రికార్డ్ ప్రయత్నం జరగనుంది. కార్యక్రమంలో పాల్గొనడానికి సాధారణ ప్రవేశ రుసుము 15 డాలర్లుగా నిర్ణయించగా... 10 ఏళ్లు, అంతకంటే తక్కువ వయసున్న పిల్లలకు ఉచిత ప్రవేశం కల్పించారు. అయితే ఎలైట్ వరల్డ్ రికార్డ్స్‌లో పాల్గొనడానికి, ఈవెంట్ జనరల్ అడ్మిషన్ కోసం వేర్వేరుగా రెండు రిజిస్ట్రేషన్లు చేసుకోవాల్సి ఉంటుందని నిర్వాహకులు స్పష్టం చేశారు. ప్రవాస తెలుగు వారంతా కుటుంబ సమేతంగా హాజరై ఈ వేడుకను విజయవంతం చేయాలని నాట్స్ చైర్మన్ కిషోర్ కంచర్ల, ప్రెసిడెంట్ రాజ్ అల్లాడ, కొలరాడో చాప్టర్ కమిటీ సభ్యులు కోరారు.



21న 'ట్రాన్స్‌ఫార్మింగ్ స్ట్రెస్ ఇన్‌టు సక్సెస్'

ప్రత్యేక ధ్యాన శిబిరం

కాలిఫోర్నియా: కాలిఫోర్నియాలోని నొవాటోలో గల 'అనుభూతి మెడిటేషన్ అండ్ రిట్రీట్ సెంటర్' (The Brahma Kumaris- Anubhuti Meditation and Retreat Center) ఆధ్వర్యంలో ట్రాన్స్‌ఫార్మింగ్ స్ట్రెస్ ఇన్‌టు సక్సెస్ (Transforming Stress into Success) పేరుతో ఒక రోజు ప్రత్యేక ధ్యాన శిబిరం నిర్వహించనున్నారు. ఈ నెల 21వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 820 Bel Marin Keys Blvd, Novato, CA 94949 వేదికగా ఈ ఇన్-పర్సన్ డే రిట్రీట్ జరగనుంది. ఈ ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఎలిజబెత్ పడిల్లా, వినోద్ ముంగల్‌పారా ఫెసిలిటేటర్స్‌గా వ్యవహరిస్తున్నారు. రిజిస్ట్రేషన్, వివరాల కోసం anubhutiretreatcenter.org వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు (లేదా) 415-884-2314 నెంబరును సంప్రదించవచ్చు. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారికి శాఖాహార భోజనం అందిస్తారు.

టీటీఎస్ ఆధ్వర్యంలో డిసెంబరు 12న మహిళల త్రోబాల్ టోర్నమెంటు



టెన్నెసీ (అమెరికా): టెన్నెసీ తెలుగు సమితి (TTS) ఆధ్వర్యంలో మహిళల కోసం ప్రత్యేకంగా 'ఉమెన్స్ త్రోబాల్ టోర్నమెంట్-2026' నిర్వహించనున్నారు. డిసెంబరు 12వ తేదీ శనివారం మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7 వరకు స్ప్రింగ్ హిల్‌లోని హజిల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ (Hustle Sports Complex, 5191 Joe Peay Rd, Spring Hill, TN 37174) వేదికగా ఈ టోర్నీ జరగనుంది. ప్రతి జట్టులో 7 మంది ప్రధాన ఆటగాళ్లు, ఇద్దరు సబ్‌స్టిట్యూట్లు (7+2) ఉండాలని నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంటులో పాల్గొనడానికి రిజిస్ట్రేషన్ ఫీజు ప్రతి జట్టుకు $250గా నిర్ణయించారు. డిసెంబరు ఒకటో తేదీతో రిజిస్ట్రేషన్ గడువు ముగుస్తుంది. ఆసక్తి గల మహిళలు తమ జట్లతో కలిసి ఈ క్రీడా వేడుకలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు ఆహ్వానించారు.







ఢిల్లీ ఇంటర్‌నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో...

42 స్టాల్స్‌తో ఆకట్టుకుంటున్న ఏపీ పెవిలియన్


దేశ రాజధాని ఢిల్లీలోని ప్రతిష్ఠాత్మక భారత మండపం వేదికగా 45వ ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్ (ఐఐటీఎఫ్) ఘనంగా ప్రారంభమైంది. ఈ నెల 27వ తేదీ వరకు జరగనున్న ఈ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తన ప్రత్యేకతను చాటుకుంటోంది.

ట్రేడ్ ఫెయిర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తరపున మొత్తం 42 స్టాల్స్‌తో ప్రత్యేక పెవిలియన్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని హస్తకళలు, చేనేత వస్త్రాలు, వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులు, పారిశ్రామిక పురోగతి, పర్యాటక విశేషాలను సందర్శకులకు కళ్లకు కట్టినట్లు ప్రదర్శిస్తున్నారు.

28 జిల్లాల ఉత్పత్తులు - 200 మంది కళాకారుల ప్రతిభ

రాష్ట్రంలోని మొత్తం 28 జిల్లాలకు చెందిన విశిష్ట ఉత్పత్తులను ఈ ప్రదర్శనలో కొలువుదీర్చారు. ఏపీ సంస్కృతి, సంప్రదాయాలు, కళానైపుణ్యాన్ని జాతీయ, అంతర్జాతీయ సందర్శకులకు పరిచయం చేస్తూ సుమారు 200 మంది కళాకారులు, హస్తకళాకారులు ఈ వేదికల్లో పాలుపంచుకుంటున్నారు. ఈ నెల 27 వరకు కొనసాగనున్న ఈ వాణిజ్య మేళాలో ఏపీ పెవిలియన్ సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తోంది.

శబరిమల ప్రసాదం పోస్ట్‌లో పంపుకోవచ్చు



శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులు ప్రసాదాన్ని ఇక పోస్టు ద్వారా తమ ఇళ్లకు పంపించుకోవచ్చు. ఇందుకు సంబంధించి శబరిమల ఆలయ ప్రాంగణంలో 24 గంటల పాటు ప్రత్యేక కౌంటర్ అందుబాటులో ఉంచుతామని తపాలాశాఖకు చెందిన పార్శిల్ విభాగం 'ఇండియా పోస్ట్' వెల్లడించింది. తద్వారా దేశవ్యాప్తంగా ఎక్కడికైనా ప్రసాదాన్ని పంపించుకోవచ్చని తెలిపింది. ఇందుకోసం ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డుతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు పేర్కొంది.

శబరిమలలో అధిక రద్దీ వల్ల భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకొని ఈ సౌలభ్యాన్ని తీసుకురానున్నట్లు ఇండియా పోస్ట్ వెల్లడించింది. భక్తులు తిరుగు ప్రయాణంలో ప్రసాదం ప్యాకెట్లను వెంట తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండా ఈ అవకాశం కల్పిస్తున్నామని, ఇంటికి చేరుకునే సమయానికి వారి ఇళ్లకు ప్రసాదం చేరుతుందని తెలిపింది. అంతేకాదు.. ఎన్ని ప్యాకెట్లనైనా ఆర్డర్ చేసుకోవచ్చని వెల్లడించింది. అయ్యప్ప మండల యాత్ర నవంబర్ 17 నుంచి ప్రారంభం కానున్న విషయం తెలిసిందే.

రామ్‌లీలా మైదానంలో
నిరసనలకు ఆంక్షల మోత!



దేశ రాజధాని ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిరసనలకు అనుమతి ఇచ్చేందుకు పలు ఆంక్షలు విధించనున్నారు. 50వేల మందికి మించకూడదు.. చీకటిపడ్డాక నిరసనలు అనుమతి ఉండదంటూ పెద్ద జాబితా రూపొందించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ ప్రాంతం ఇటీవల వరుస నిరసనలతో అట్టుడికింది. ఓట్ చోరీ, నీట్ యూజీ పరీక్ష అంశాలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), కాంగ్రెస్ పార్టీలు నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. ఈ సందర్భంగా దేశ రాజధానిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఢిల్లీ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. నిరసనలు,ప్రదర్శనలకు అనుమతించే ప్రాంతాలజాబితా నుంచి జంతర్ మంతర్‌ను తొలగించారు. ప్రత్యామ్నాయ వేదికలుగా రామ్‌లీలా మైదానం, బురారీ గ్రౌండ్, సీబీడీ గ్రౌండ్‌లను నిర్ణయించారు.

అయితే రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించే నిరసనలు, ప్రదర్శనలు, ర్యాలీలు, బహిరంగ సమావేశాల నియంత్రణకు ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని ఢిల్లీ పోలీసులు రూపొందించారు. ముసాయిదా మార్గదర్శకాల ప్రకారం.. రామ్‌లీలా మైదాన్‌లో 50వేల మందికిమించి గుమిగూడేందుకు అనుమతి ఉండదు. నిరసనల్లో పాల్గొనే వారి సంఖ్యను కార్యక్రమ స్వభావం, జనసమూహ పరిమాణం, అందుబాటులో ఉన్న భద్రతా ఏర్పాట్ల ఆధారంగా సంబంధిత అధికారులు నిర్ణయిస్తారు. అలాగే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే నిరసనలకు అనుమతి ఇవ్వనున్నారు. అంతేకాకుండా, కార్యక్రమ నిర్వాహకులు పోలీసుల అనుమతి కోరే ముందు ఢిల్లీ మున్సిపల్‌కార్పొరేషన్ నుంచిముందస్తు అనుమతితీసుకోవాల్సి ఉంటుంది. ఈ దరఖాస్తును సాధారణంగా ప్రతిపాదిత కార్యక్రమానికి కనీసం 10రోజుల ముందుగా సమర్పించాలి. మరోవైపు, వేదిక వద్ద తుపాకులు, కత్తులు, ఈటెలు, పదునైన వస్తువులు, ఇతర నిషేధిత వస్తువుల అనుమతి నిరాకరించనున్నారు. రామ్‌లీలా గ్రౌండ్ పరిసరాల్లో డ్రోన్ల వినియోగానికీ ముందస్తు అనుమతి తప్పనిసరి చేశారు. ట్రాఫిక్ అధికారులతో సమన్వయం చేసుకోవడంతోపాటు పార్కింగ్ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యతా నిర్వాహకులదే. అలాగే, రోడ్లు, అత్యవసర ప్రవేశ మార్గాలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూసుకోవాలి. ప్రతిపాదిత మార్గదర్శకాల ప్రకారం కార్యక్రమ నిర్వాహకులు తాగునీరు, వైద్య సదుపాయం, పారిశుద్ధ్య నిర్వహణ వంటివి చేయాల్సి ఉంటుంది. కాగా, ముసాయిదా మార్గదర్శకాలను ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయానికి పంపినట్లు ఓ సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. ఈ ప్రతిపాదన ప్రస్తుతం ప్రాథమిక దశలోనే ఉందని, నియమ నిబంధనలను ఇంకా ఖరారు చేయాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు.

మేకెదాటు ప్రాజెక్టుపై డీకే వ్యాఖ్యలు సరికాదు

- తప్పుబట్టిన తమిళనాడు పీసీసీ చీఫ్ మాణిక్యం ఠాగూర్



కావేరీనదిపై కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టాలనుకుంటున్న మేకెదాటు ప్రాజెక్టుపై పొరుగు రాష్ట్రంలోని సొంత పార్టీ నుంచే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఆ ప్రాజెక్టుపై తమిళనాడు పీసీసీ అధ్యక్షుడు మాణిక్యం ఠాగూర్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. ప్రాజెక్టుకోసం పట్టుబడుతున్న కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను ఎక్స్ వేదికగా ఆయన తప్పుపట్టారు. తమిళనాడు రైతుల ప్రయోజనాలను డీకే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆ ప్రాజెక్టుకు తుది ఆమోదం ఇవ్వకూడదని కేంద్రాన్ని ఆయన కోరారు. ప్రాజెక్టు కట్టాలని చూస్తే తమ రాష్ట్ర హక్కులు,ప్రయోజనాల కోసం ఎంత వరకైనా పోరాడుతామని హెచ్చరించారు. ప్రతిపాదిత డ్యామ్‌కు చట్టబద్ధంగా ఉన్న అనుమతులను వెంటనే క్లియర్ చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని డీకే శివకుమార్ ఇటీవలే మైసూరులో కోరారు. మైసూరులో ఈనెల 13న ప్రధాని మోదీ సమక్షంలో జరిగిన కార్యక్రమంలో డీకే శివకుమార్ మాట్లాడుతూ మేకెదాటు ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎవరూ అడ్డుకోలేరన్నారు. ఆ ప్రాజెక్టుకు కేంద్రం తుది ఆమోదం ఇవ్వాలని కోరారు.

ఈ నేపథ్యంలో మాణిక్యం స్పందిస్తూ డీకే వ్యాఖ్యలు సరికావన్నారు. కర్ణాటక సీఎం వ్యాఖ్యలు సుప్రీంకోర్టు నిర్ణయానికి, కావేరి నదీ జలాల ట్రైబ్యునల్ తుది తీర్పుకు వ్యతిరేకంగా ఉన్నాయని ఆయన విమర్శించారు.కావేరి నదీ జలాల పంపిణీ ఒప్పందం ప్రకారం దిగువ పరివాహక రాష్ట్రమైన తమిళనాడుకు ఉన్న హక్కులను విస్మరించి, నదిపై ప్రభావం చూపే ప్రాజెక్టుల విషయంలో కర్ణాటక ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకూడదని ఆయన సూచించారు. తమిళనాడు అంగీకారం లేకుండా ప్రాజెక్టుకు ఆమోదం తెలిపితే అది చట్టవ్యతిరేకం అవుతుందని, అంతేకాకుండా తమిళనాడు డెల్టా జిల్లాల రైతులపైనా తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు.

ఎందుకు వివాదం..

ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సొంతూరు అయిన కనకపుర సమీపంలో కావేరి నదిపై మేకెదాటు డ్యాం కట్టాలని కర్ణాటక ప్రభుత్వంయోచిస్తోంది. బెంగళూరు తాగునీటి అవసరాలు తీర్చడమే ఈ ప్రాజెక్టు ఉద్దేశం. కరువు సమయంలో ఆ ప్రాజెక్టు ఒక బఫర్‌గా ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. అదే సమయంలో తమిళనాడుకు చాలినన్ని నీళ్లు దొరికేలా చూస్తామని కర్ణాటక హామీ ఇస్తోంది. అయితే, ఈ ప్రాజెక్టును తమిళనాడు తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఆ ప్రాజెక్టు పూర్తిచేస్తే, కావేరి జలాల్లో తమ రాష్ట్ర వాటాపై ప్రభావం పడుతుందని, ఆ నదిపై ఆధారపడిన రైతులకూ నష్టం కలుగుతుందని తమిళనాడు వాదిస్తోంది.

యువతకు ప్రోత్సాహం.. రూ.కోటి క్విజ్ పోటీ

- పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ప్రకటన

పంజాబ్ రాష్ట్రంలోని యువతలో చదువు, విజ్ఞాన సముపార్జనపై జిజ్ఞాసను పెంపొందించేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం చక్కటి నిర్ణయం తీసుకుంది. రాష్ట్రస్థాయిలో యువతకు క్విజ్ పోటీలు నిర్వహించి గెలిచిన విజేతకు బహుమతిగా కోటి రూపాయలు ఇవ్వనుంది. రాష్ట్రంలోని యువతను ప్రోత్సహించడానికి 'పంజాబ్ దా కరోడ్‌పతి" అనే క్విజ్ పోటీని ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి భగవంత్ మాన్ వెల్లడించారు. పంజాబ్ చరిత్ర, సంస్కృతి, భౌగోళిక అంశాలు, గణితం, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన వివిధ విషయాలపై ప్రశ్నలు ఉంటాయన్నారు. ఇందులో విజేతకు రూ.1 కోటి నగదు బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. రన్నరప్‌లుగా నిలిచిన నలుగురికి ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున బహుమతులు ఇస్తామన్నారు. ఇందులో పాల్గొన్న దాదాపు 10వేల మంది యువతకు ఇతర బహుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రంలోని 15-30ఏళ్ల మధ్య వయస్సు గల యువతీయువకులు అందరూ ఈ పోటీలో పాల్గొనవచ్చని పంజాబ్ సీఎం భగవంత్ పేర్కొన్నారు. ఇందుకోసం పాఠశాలలు, కళాశాలలు విద్యార్థుల పేర్లను నమోదు చేయాలని సూచించారు. ఈ క్విజ్‌లో మొత్తం 11 రౌండ్లు ఉంటాయి.. వీటిలో తొమ్మిది రౌండ్లు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా, రెండు రౌండ్లు ప్రత్యక్షంగా



జరుగుతాయి. టీవీ క్విజ్ షో 'కౌన్ బనేగా కరోడ్‌పతి' తరహాలోనే ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు నాలుగు ఆప్షన్లు ఉంటాయి. పదో రౌండ్ 23 జిల్లాల్లో నిర్వహిస్తారు. అక్కడి టాపర్లు గ్రాండ్ ఫైనల్‌కు అర్హత సాధిస్తారు. ఫైనల్లో ఒకరిని విజేతగా ప్రకటిస్తారు.

ఒకే వేదికపై ముగ్గురు అగ్రనేతల కలయిక



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వచ్చే వారం చైనాలో జరిగే ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార (ఏపీఈసీ) సదస్సు సందర్భంగా ఒకే వేదికపై సమావేశం కానున్నారు. ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన అణ్వాయుధ దేశాలకు నాయకత్వం వహిస్తున్న ఈ ముగ్గురు నేతల భేటీ అంతర్జాతీయంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. చైనాలోని షెన్‌జెన్ నగరంలో నవంబర్ 18, 19 తేదీల్లో ఏపీఈసీ నేతల సదస్సు జరగనుంది.

ఈ సదస్సు సందర్భంగా నవంబర్ 19న ట్రంప్, జిన్‌పింగ్, పుతిన్ త్రైపాక్షిక సమావేశంలో పాల్గొననున్నట్లు అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి. ఈ ముగ్గురు నేతలు ఒకేసారి సమావేశం కావడం అరుదైన పరిణామంగా భావిస్తున్నారు. అణ్వాయుధాల నియంత్రణ, వాటి సంఖ్యను తగ్గించడం వంటి అంశాలు ఈ చర్చల్లో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చే అవకాశముంది. ముఖ్యంగా అమెరికా, రష్యా, చైనా దేశాల మధ్య అణ్వాయుధాల విషయంలో పరస్పర అవగాహన పెంపొందించుకోవడంపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. అమెరికా, రష్యా వద్ద ఐదువేలకు పైగా అణ్వాయుధాలు ఉండగా, చైనా వద్ద 600కు పైగా ఉన్నట్లు అమెరికా రక్షణ శాఖ అంచనాలు చెబుతున్నాయి.

ఈ మూడు దేశాల మధ్య అణ్వాయుధాల నియంత్రణకు సంబంధించి ఒక ఒప్పందం కుదరాలని ట్రంప్ ఆసక్తి చూపుతున్నారు. ఇక, ఇటీవల ట్రంప్ మాట్లాడుతూ.. జిన్‌పింగ్, పుతిన్‌లతో జరిగే సమావేశంలో ఇరాన్ యుద్ధాన్ని ముగించే అంశంపై కూడా చర్చించనున్నట్లు తెలిపారు. అయితే ఉక్రెయిన్ యుద్ధం గురించి ఈ ముగ్గురు నేతలు చర్చిస్తారా లేదా అన్నది ఇంకా స్పష్టత లేదు. తమ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తమ భాగస్వామ్యం లేకుండా చర్చలు జరగకూడదని ఉక్రెయిన్ ఇప్పటికే స్పష్టం చేసింది.

సాంకేతిక సమస్యలతో... అమెరికాలో నిలిచిన వేలాది విమానాలు



అమెరికాలో విమాన ప్రయాణికులకు తీవ్ర అంతరాయం ఎదురైంది. సాంకేతిక సమస్య కారణంగా దాదాపు 11వేల విమానాలు కొన్ని గంటల పాటు ఎయిర్‌పోర్టుల్లోనే నిలిచిపోయాయి. అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 4గంటల (భారత్‌లో శనివారం తెల్లవారు జామున 2.30 గంటల) సమయంలో ఈ అంతరాయం ఏర్పడింది. ప్రాంతీయఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సెంటర్ల వద్ద కమ్యూనికేషన్ వ్యవస్థల్లో సాంకేతిక సమస్య కారణంగా అసాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అమెరికా వ్యాప్తంగా విమానాల టేకాఫ్‌లను నిలిపివేయాలని ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు ఆదేశించారు. దీంతో వేలాది విమాన సర్వీసులపై ప్రభావం పడింది. ఈ అంతరాయం కారణంగా నేలపై ఉన్న విమానాల టేకాఫ్‌లను నిలిపివేశారు. అయితే అప్పటికే గాల్లో ఉన్న విమానాలు మాత్రం తమప్రయాణాన్ని కొనసాగించి గమ్యస్థానాలకు చేరుకునేందుకు అనుమతించారు. దాదాపు 10వేల విమానాలు ఆలస్యమయ్యాయని, మరో 1000సర్వీసులు రద్దయ్యాయని ఫ్లైట్ ట్రాకింగ్ సర్వీస్ 'ఫ్లైట్ అవేర్' డేటా వెల్లడించింది. దీంతో దాదాపు 15 లక్షల మంది ప్రయాణికులు విమానాశ్రయాల్లో పడిగాపులు కాశారు. అమెరికా రవాణా శాఖ మంత్రి సీన్ డఫీ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు.

కాగా, సుమారు నాలుగు గంటల అనంతరం పరిస్థితి మెరుగుపడటంతో విమానాలు బయలుదేరేందుకు మళ్లీ అనుమతులు ఇచ్చారు. అయినప్పటికీ విమానాలు,సిబ్బంది వివిధప్రాంతాల్లో చిక్కుకుపోవడంతో సేవలు సాధారణ స్థితికి రావడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

సైబర్ దాడి కాదు: ట్రంప్

ఈ పరిణామాలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు.ఇది సైబర్ దాడి లేదా కృత్రిమ మేధ కారణంగా ఏర్పడిన సమస్య కాదని ఆయన తెలిపారు. మైక్రోసాఫ్ట్ సర్వీసులకు అంతరాయం ఏర్పడిన సమయంలోనే విమాన సేవలు నిలిచిపోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, దీనికి తమ సేవలతో ఎలాంటి సంబంధం లేదని మైక్రోసాఫ్ట్ వెల్లడించింది.



పేలిపోయిన స్టార్‌షిప్ రాకెట్ బూస్టర్

ఎలాన్ మస్క్ కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ చేపట్టిన కీలక ప్రయోగం పాక్షికంగానే విజయవంతమైంది. అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం.. టెక్సాస్‌లోని లాంచ్ ప్యాడ్ నుంచి స్టార్‌షిప్ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. మొత్తం 26 ఉపగ్రహాలను కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టింది. అయితే, రాకెట్ కింది భాగాన్ని లాంచ్ టవర్ వద్ద తిరిగి ఒడిసిపట్టుకోవాలన్న సంస్థ లక్ష్యం నెరవేరలేదు. సురక్షితంగా లాంచ్ ప్యాడ్‌కు తిరిగి రావాల్సిన సూపర్ హెవీ బూస్టర్ సాంకేతిక లోపంతో పేలిపోయి గల్ఫ్ ఆఫ్ మెక్సికో సముద్రంలో పడిపోయింది. రాకెట్ పైభాగంలోని వ్యోమనౌక మాత్రం అంతరిక్షంలో తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. ఈ స్పేస్ క్రాఫ్ట్ భూమి చుట్టూ 14 కక్ష్యలను పూర్తి చేసుకుని ప్రయోగం జరిగిన 22.5 గంటల తర్వాత తిరిగి భూమిని చేరుకోనుంది.

ఇరాన్ దాడిలో బహ్రెయిన్‌లోని
అమెరికా రాడార్ ధ్వంసం

అమెరికా, ఇరాన్ మధ్య సైనిక ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరాయి. తమపై అమెరికా దాడి చేసిన గంటలోపే ప్రతీకారం తీర్చుకున్నామని ఇరాన్ ప్రకటించింది. బహ్రెయిన్‌లోని అమెరికా సైన్యానికి చెందిన కీలకమైన ఎర్లీ వార్నింగ్ రాడార్ వ్యవస్థను తమ ఏరోస్పేస్ దళాలు ధ్వంసం చేసినట్లు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) వెల్లడించింది.



అంతకుముందు ఇరాన్‌లోని సిరిక్ ప్రాంతంలో ఉన్న టెలికమ్యూనికేషన్ టవర్‌పై అమెరికా వైమానిక దాడి చేసిందని ఐఆర్‌జీసీ ఆరోపించింది. దీనికి ప్రతిగా దాదాపు గంటలోపే బహ్రెయిన్ ద్వీపంలోని అమెరికా ఎర్లీ వార్నింగ్ రాడార్‌ను తాము లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది. గగనతలంలో సైనిక కార్యకలాపాలను ముందుగానే గుర్తించే ఈ వ్యవస్థను ధ్వంసం చేసినట్లు పేర్కొంది.

బహ్రెయిన్ రాడార్‌ను ధ్వంసం చేయడం అమెరికాకు పంపిన తీవ్రమైన సందేశమని ఐఆర్‌జీసీ స్పష్టం చేసింది. ఇరాన్ సరిహద్దులను మరోసారి ఉల్లంఘించినా, తమపై దాడులకు దిగినా పరిమితులు లేకుండా ప్రతిస్పందిస్తామని హెచ్చరించింది.

ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయ్.. ఇతర దేశాలను కూడా హెచ్చరించారు. ఇరాన్‌పై అమెరికా చేపట్టే సైనిక చర్యలకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సహకరించే దేశాలను తమపై దాడికి దిగిన భాగస్వాములుగా పరిగణిస్తామని స్పష్టం చేశారు. ఈ పరిణామాలతో గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.

అయితే, బహ్రెయిన్‌లో రాడార్ వ్యవస్థపై దాడి చేశామన్న ఐఆర్‌జీసీ ప్రకటనను అమెరికా సైన్యం ఖండించింది. పశ్చిమాసియాలో అమెరికా అనుకూల దేశం బహ్రెయిన్. ఇక్కడ అమెరికాకు అతిపెద్ద నావికాదళం ఉంది.

యూఎస్‌సీఐఆర్ఎఫ్ నివేదిక మొత్తం వక్రీకరణలే

- అమెరికాలోని భారత రాయబారి వినయ్ క్వాత్రా



ఇతరులకు నీతులు చెప్పేవారు తమ పక్షపాత ధోరణిపై ఆత్మ పరిశీలన చేసుకుని, ఉచిత సలహాలు మానుకోవాలని 'అంతర్జాతీయ మత స్వేచ్ఛపై యూఎస్ కమిషన్' (యూఎస్‌సీఐఆర్ఎఫ్) కమిషన్ నివేదికపై అమెరికాలోని భారత రాయబారి వినయ్ క్వాత్రా చురకలు అంటించారు. భారత్‌లో మత స్వేచ్ఛ పరిస్థితి దిగజారుతోందని అమెరికాకు చెందిన యూఎస్‌సీఐఆర్ఎఫ్ తన నివేదికలో పేర్కొంది. భారత్‌లో మతపరమైన కారణాలతో అరెస్టులు జరిగాయని ఆరోపిస్తూ.. దేశ రాజధానిలో 2020లో చోటుచేసుకున్న అల్లర్ల కేసులో అరెస్టయిన షార్జీల్ ఇమామ్ ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. మత స్వేచ్ఛ కోసం వాదించినందుకు అతడిని కొన్నేళ్లుగా నిర్బంధించారని ఆరోపించింది. ఈ వ్యాఖ్యలను అమెరికాలోని భారత రాయబారి వినయ్ క్వాత్రా తీవ్రంగా ఖండించారు.

అదంతా కేవలం ఏకపక్ష వైఖరితో రూపొందించిన నివేదిక అన్నారు. వాస్తవాలను నిర్ధారించుకోకుండా అప్పుడు భావాలను వ్యాప్తి చేయటం మానుకోవాలన్నారు. భారత పౌరుల రాజ్యాంగ హక్కులపై మాట్లాడేందుకు, తీర్పులు చెప్పేందుకు ఆ కమిషన్‌కు ఎలాంటి అర్హత లేదని పేర్కొన్నారు. యూఎస్‌సీఐఆర్ఎఫ్‌కు అలవాటైన పక్షపాత ధోరణి, తప్పుడు సమాచారంతో కూడిన అంచనాలు భారత్‌లోని మత స్వేచ్ఛ, రాజ్యాంగ నిబద్ధతను తగ్గించలేవని స్పష్టం చేశారు. సదరు కమిషన్ కొన్నేళ్లుగా భారత్ విషయంలో వక్రీకరించిన, ఎంచుకున్న అంశాలను మాత్రమే ప్రదర్శిస్తోందని.. వాస్తవాల కంటే సందేహాస్పదమైన, భావజాలపరమైన కథనాలపై ఆధారపడుతోందని విమర్శించారు. కాగా మత స్వేచ్ఛపై యూఎసీసీఐఆర్ఎఫ్ పక్షపాత వైఖరి ప్రదర్శిస్తోందని కొన్నేళ్లుగా భారత్ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే.

హసీనాను తిరిగి పంపేందుకు భారత్ షరతులు!



భారత్‌లో ఆశ్రయం పొందుతున్న బంగ్లాదేశ్ మాజీప్రధాని షేక్ హసీనా డిసెంబర్‌లో స్వదేశానికి వెళ్లనున్నట్లు ఇప్పటికే ప్రకటించగా, అందుకు భారత్ సుముఖంగానే ఉన్నప్పటికీ.. హసీనా భద్రత విషయంలో ఆ దేశం హామీ ఇవ్వాలని కోరుతూ పలు షరతులు పెట్టినట్లు సమాచారం. ఈ మేరకు బంగ్లా మీడియాకథనాలు వెల్లడించాయి. ఆమెపై దాడులు జరగకుండా భద్రత కల్పించడం, తన కు విధించిన మరణ శిక్షపై హసీనా న్యాయస్థానంలో అప్పీలు చేసుకునే అవకాశం కల్పించడం, నిష్పక్షపాతంగా విచారణను ఎదుర్కొని న్యాయం జరిగేలా చూడడం, 2024 నాటి అణచివేత ఘటనలపై తిరిగి విచారణ జరపడం వంటివి అందులో ఉన్నట్లు తెలుస్తోంది.

అదే సమయంలో హసీనాను తిరిగి బంగ్లాదేశ్‌కు తీసుకెళ్లడానికి ఆ దేశం తమ సైనిక విమానాన్ని పంపాలని భారత్ అడిగినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. లేదంటే భారత్-బంగ్లా భూసరిహద్దు మార్గంలో పొరుగు దేశ సైన్యం హసీనాను మర్యాదపూర్వకంగా ఆహ్వానించాలని షరతు విధించినట్లు తెలిపాయి. ఈ కథనాలపై బంగ్లాదేశ్ ప్రధాని సహాయ మీడియా కార్యదర్శి నజ్ముల్ హక్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. హసీనాకు ఆశ్రయం కల్పించడానికి ఏ దేశమూ సుముఖత చూపట్లేదన్నారు. ఆమెకు ఒక్కొక్కటిగా అన్ని మార్గాలు మూసుకుపోయాయని అన్నారు. దీంతో చివరి ప్రయత్నంగా ఆమె బంగ్లాదేశ్‌కు తిరిగి రావాలని కోరుకుంటున్నారంటూ విమర్శలు చేశారు.

అయితే, హసీనా విషయంలో భారత్ షరతులు విధించినట్లు వస్తున్న కథనాలను బంగ్లా ప్రభుత్వం ధ్రువీకరించలేదు. మరోవైపు, వీటిపై స్పందించడానికి భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జయస్వాల్ సైతం నిరాకరించడం గమనార్హం.

ఆఖరి బంతికి అద్భుత విజయం

- యూ-19 ఆసియా కప్ మనదే
- ఉత్కంఠపోరులో పాక్‌పై టీమిండియా గెలుపు

అండర్-19 వన్డే ఆసియాకప్ 2026 టైటిల్‌ను భారత్ కైవసం చేసుకుంది. శనివారం దోహాలోని అల్ అమెరాత్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో టీమిండియా ఒక్క వికెట్ తేడాతో అద్భుత విజయం సాధించింది. ఈ గెలుపుతో భారత్ రికార్డు స్థాయిలో 9వ సారి అండర్-19 ఆసియా కప్ ట్రోఫీని ముద్దాడింది.

తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 337 పరుగులు చేసింది. ఈ టార్గెట్‌ని భారత్ సరిగ్గా 50 ఓవర్లలో ఛేదించింది. చివరి బంతికి మూడు పరుగులు చేయాల్సిన దశలో మోహిత్ (49 నాటౌట్: 26 బంతుల్లో) ఫోర్ బాది జట్టును విజయతీరాలకు చేర్చాడు.

ఓటమి అంచుల నుంచి విజయం వైపు..

338 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన భారత్, ఒకానొక దశలో 252 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచింది. అయితే లోయర్ ఆర్డర్ బ్యాటర్ మనల్ చౌహాన్, ఫాస్ట్ బౌలర్ మోహిత్ ఉల్వా పాక్ బౌలర్లపై ఎదురుదాడికి దిగి మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశారు. వీరిద్దరూ కీలక భాగస్వామ్యం నెలకొల్పి భారత్‌ను విజయం దిశగా నడిపించారు. కెప్టెన్, ఓపెనర్ లక్ష్య రాజేశ్ రాయిచందాని (80; 101 బంతుల్లో), ఆర్యవీర్ సెహ్వాగ్ (58; 61 బంతుల్లో) అర్ధ శతకాలు చేశారు. రాజేశ్, ఆర్యవీర్ తొలి వికెట్కు 95 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆర్యవీర్ జైతైనా వినీత్‌తో కలిసి రాజేశ్ ఇన్నింగ్సును ముందుకు నడిపించాడు. తర్వాత వినీత్, అర్జున్, యశ్ (9) పెవిలియన్‌కు చేరడంతో 33 ఓవర్లకు భారత్ 187/4తో నిలిచింది. కాసేపటికే వరుస బంతుల్లో రాజేశ్, అన్వయ్ కూడా ఔట్ కావడంతో భారత్ 223/6తో కష్టాల్లో పడింది. ఈక్రమంలో క్రీజులోకివచ్చిన మనల్‌చౌహాన్ మొదట్లో నెమ్మదిగా ఆడి తర్వాత జోరు పెంచాడు. నికాబ్ షఫిక్ వేసిన 40 ఓవర్లో మనల్ రెండు ఫోర్లు, సిక్స్ బాదడంతో భారత్ విజయసమీకరణం 60 బంతుల్లో 90 పరుగులుగా మారింది. మరోవైపు.. ఆర్యన్ సవ్వాని (9), కావ్యా పటేల్ వరుస ఓవర్లలో ఔట్ కావడంతో భారత్ 252/8 తో మళ్లీ కష్టాల్లో పడింది.



ఆఖరి రెండు ఓవర్లలో హైడ్రామా

మనల్, మోహిత్ జోడీ నిలకడగా బౌండరీలు బాది లక్ష్యాన్ని కరిగించింది. 45-46 ఓవర్ల మధ్య ఈ ద్వయం 45 పరుగులు రాబట్టింది. విజయానికి 17 బంతుల్లో 29 పరుగులు అవసరమైన దశలో 48 ఓవర్లో మనల్ చౌహాన్ ఔట్ కావడంతో భారత శిబిరంలో ఉత్కంఠ నెలకొంది. ఆఖరి వికెట్‌గా క్రీజులోకి వచ్చిన చిగురుపాటి వెంకట (11 నాటౌట్), మోహిత్ ఉల్వాకు చక్కటి సహకారం. అందించాడు.

మొహమ్మద్ సయ్యమ్ వేసిన 49 ఓవర్ తొలి రెండు బంతులను మోహిత్ వరుసగా ఫోర్, సిక్సర్‌గా మలిచాడు. నాలుగో బంతిని వెంకట బౌండరీకి తరలించగా, మూడు సింగిల్స్‌తో కలిపి ఈ ఓవర్లో మొత్తం 17 పరుగులు వచ్చాయి.

దీంతో చివరి 6 బంతుల్లో భారత్ విజయానికి 8 పరుగులు అవసరమయ్యాయి. తొలి బంతి డాట్ కాగా, రెండో బంతి వైడ్ అయింది. ఆ తర్వాత మూడు బంతుల్లో నాలుగు సింగిల్స్ రావడంతో, ఆఖరి బంతికి 3 పరుగులు అవసరమయ్యాయి. ఒత్తిడిని జయించిన మోహిత్ ఉల్వా చివరి బంతిని బౌండరీకి తరలించి భారత్ కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.

ఒత్తిడిని అధిగమించి.. కప్ గెలిపించి..

భళా మోహిత్ ఉల్వా!



అసలే భారత్, పాకిస్థాన్ మధ్య పోటీ... అందులోనూ ఫైనల్ మ్యాచ్ అయితే ఉత్కంఠ ఏ స్థాయిలో ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అలాంటి హైఓల్టేజ్ పోరులో టీమిండియా యువ ఆటగాడు మోహిత్ ఉల్వా సంచలనం సృష్టించాడు.ఓటమి అంచున ఉన్న భారత జట్టును ఒంటిచేత్తో విజయతీరాలకు చేర్చాడు. అండర్-19 ఆసియా కప్ ఫైనల్‌లో పదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి కేవలం 26 బంతుల్లో అజేయంగా 49పరుగులు చేసి'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' గా నిలిచాడు.చివరి బంతికిబౌండరీ బాది భారత్‌కు ఒక్క వికెట్ తేడాతో అద్భుత విజయాన్ని అందించాడు. దీంతో టీమిండియా ఆసియా కప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది.

338 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ ఒక దశలో 252 పరుగులకే ఎనిమిది వికెట్లు కోల్పోయింది. అప్పటికి విజయానికి 86 పరుగులు అవసరం కాగా.. చేతిలో ఉన్నవి కేవలం రెండు వికెట్లే. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన మోహిత్ ఉల్వా మ్యాచ్ గతినే మార్చేశాడు. మనల్ చౌహాన్‌తో కలిసి తొమ్మిదో వికెట్‌కు 57 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. చివరి ఓవర్ వేసిన అహ్మద్ హుస్సేన్ తొలి బంతికి గూగ్లీ సంధించగా.. మోహిత్ బీట్ అయ్యాడు. స్టంపౌట్ అయ్యే ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నాడు. చివరి బంతికి భారత్ విజయానికి మూడు పరుగులు అవసరమయ్యాయి.ఈసారి మాత్రం మోహిత్ ఏమాత్రం తడబడలేదు. క్రీజు నుంచి ముందుకొచ్చి అహ్మద్ హుస్సేన్ బంతిని వైడ్ లాంగ్ ఆఫ్ దిశగా బలంగా బాదాడు. బంతి ఒక్కసారి బౌన్స్ అయి బౌండరీ దాటడంతో భారత్ సంచలన విజయాన్ని అందుకుంది. దీంతో భారత ఆటగాళ్ల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. మైదానంలోకి పరుగెత్తుకొచ్చిన సహచర ఆటగాళ్లు మోహిత్‌ను చుట్టుముట్టి సంబరాలు చేసుకున్నారు.

ఎవరీ మోహిత్ ఉల్వా?

మోహిత్ ఉల్వా గుజరాత్‌లోని జామ్‌నగర్‌కు చెందిన 18 ఏళ్ల యువ క్రికెటర్. క్రికెట్ బంగ్లా అకాడమీలో మహేంద్రసిన్హ్ చౌహాన్ వద్ద శిక్షణ పొందాడు. ఈ అకాడమీకి భారత స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాతోనూ అనుబంధం ఉంది. జడేజా క్రికెట్ ప్రారంభ దశలో ప్రతిభను గుర్తించి తీర్చిదిద్దిన కోచ్ కూడా మహేంద్రసిన్హ్ చౌహానే కావటం గమనార్హం. మోహిత్ ఇప్పటికే భారత అండర్-19 జట్టులో చోటు సంపాదించాడు. 2026లో ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగిన యూత్ టెస్టులో అరంగేట్రం చేసిన అతడు.. తొలి అవకాశాల్లోనే 92 పరుగులతో ఆకట్టుకున్నాడు. శ్రీలంకతో జరిగిన అండర్-19 పరిమిత ఓవర్ల సిరీస్‌లోనూ ఆడాడు. అయితే పాకిస్థాన్‌తో జరిగిన ఆసియా కప్ ఫైనల్ అతడి కెరీర్‌లో ప్రత్యేకమైన మలుపుగా నిలిచింది. యూ-19 ఆసియాకప్ ఫైనల్ మ్యాచ్ చేజారుతున్న సమయంలో చివరి వరుసలో వచ్చి గెలిపించి సత్తా చాటాడు.

సిరీస్ పట్టేస్తారా?

- నేడు కివీస్‌తో నిర్ణాయక ఐదో వన్డే, 2-1 ఆధిక్యంలో టీమిండియా



కివీస్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో విజేతను నిర్ణయించే తుది పోరుకు భారత్ సిద్ధమయింది. ఆ దేశంలోని మౌంట్ మౌంగనుయ్ వేదికగా ఆదివారం న్యూజిలాండ్ - భారత్ ఐదో వన్డే మ్యాచ్ జరగనుంది. ప్రస్తుతం సిరీస్‌లో భారత్ 2-1తో పైచేయిలో ఉంది. చివరి మ్యాచ్‌లో గెలిస్తేనే సిరీస్ దక్కుతుంది. దీంతో విజయం కోసం టీమిండియా జట్టు సర్వశక్తులూ ఒడ్డనుంది.

అయితే ఇదే వేదికలో శుక్రవారం జరిగిన నాలుగో న్యూజిలాండ్ పేస్ షాక్‌తో భారత్ విలవిలలాడింది. న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలింగ్ దెబ్బకు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్ డకౌట్ కావడం అభిమానులను విస్మయానికి గురిచేసింది. ముఖ్యంగా మ్యాట్ హెన్రీ వేసిన తొలి ఓవరే భారత పతనానికి పునాది వేసింది. నాలుగో వన్డేలో 334 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన శ్రేయస్ సేన 26.4 ఓవర్లలో 89 పరుగులకే చేతులెత్తేసింది. ఇప్పుడు ఆ ఘోర పరాభవం నుంచి బయటకొచ్చి.. సిరీస్ విజయంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గత మ్యాచ్ లో భారత టాప్ ఆర్డర్‌ను కకావికలం చేసిన బౌలర్ మ్యాట్ హెన్రీ, మొత్తం ఆరు వికెట్లు తీసి అదరగొట్టాడు. అయితే, టెస్టు సిరీస్ కోసం హెన్రీతోపాటు సిరీస్‌లో నిలకడగా రాణిస్తున్న కైలే జేమీసన్‌కు న్యూజిలాండ్ మేనేజ్‌మెంట్ విశ్రాంతి ఇచ్చింది. దీంతో సిరీస్ విజేతను నిర్ణయించే అయిన ఆఖరి మ్యాచ్లో హెన్రీ లేకపోవడం భారత్‌కు భారీఊరటే. కానీ, ఇక్కడ మిగతా కివీస్ పేసర్లను తక్కువ గా అంచనావేయడానికి వీల్లేదు.మాథ్యూ ఫిషర్, జాకబ్ డఫీ క్రిస్టియన్ క్లార్క్, బ్లెయిర్ టిక్నర్, ఆడం మిల్నే కూడా ఫాస్ట్ బౌలింగ్‌కు అనుకూలించే పిచ్‌పై భారత్‌ను ఇబ్బంది పెట్టగల సమర్థులే.

నాలుగో మ్యాచ్ పరాభవాన్ని మర్చిపోయి టీమిండియా స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లి,రోహిత్ శర్మ బ్యాట్ ఝుళిపించాల్సి ఉంటుంది. తొలి వన్డేలో 74 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచిన కోహ్లి, రెండో మ్యాచ్‌లో 7 పరుగులకు, నాలుగోమ్యాచ్‌లో సున్నా పరుగులకు అవుటయ్యాడు. చివరి మ్యాచ్‌లో అతడి నుంచి భారీస్కోరు కోసం జట్టు ఎదురు చూస్తోంది. ఇక రోహిత్ తొలిమ్యాచ్‌లో తేలిపోగా, రెండో మ్యాచ్‌లో ఫరవాలేదనిపించి నాలుగోమ్యాచ్‌లో డకౌటయ్యాడు. తాత్కాలిక కెప్టెన్ శ్రేయస్‌అయ్యర్ కూడా బ్యాటింగ్‌లో రాణించాలి. ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్, మిడిల్ ఆర్డర్‌లో ఇషాన్ కిషన్,రాహుల్, లోయర్ ఆర్డర్‌లో అక్షర్, నమన్ కూడా పరుగులు చేసి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు. సిరీస్‌లో మొదటి రెండు మ్యాచ్‌ల్లో టీమిండియా గెలవగా, మూడో మ్యాచ్ వర్షం వల్ల రద్దయింది. నాలుగో మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఘన విజయం సాధించింది.

---

30 ఏళ్ల తరువాత జింబాబ్వే పర్యటనకు ఇంగ్లండ్?

ఇంగ్లండ్-జింబాబ్వే మధ్య చారిత్రత్మక టెస్ట్ మ్యాచ్‌కు రంగం సిద్ధమవుతోంది. దాదాపు మూడు దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత జింబాబ్వేలో ఇంగ్లండ్ క్రికెట్ జట్టు పర్యటించనున్నట్లు తెలస్తోంది. ఈ టూర్లో భాగంగా ఇంగ్లీష్ జట్టు ఆతిథ్య జింబాబ్వేతో ఏకైక టెస్ట్ మ్యాచ్ ఆడనున్నట్లు సమాచారం. ఇండోనేషియాలోని బాలిలో జరిగిన ఐసీసీ త్రైమాసిక సమావేశంలో ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ఈ పర్యటనకు అంగీకరించినట్లు వార్తలు వస్తున్నాయి. కాగా 1996 తర్వాత ఇంగ్లండ్ జట్టు జింబాబ్వేలో టెస్టు మ్యాచ్ ఆడనుండటం ఇదే తొలిసారి. ఈ మ్యాచ్‌కు సంబంధించిన అధికారిక తేదీలను ఇరు దేశాల బోర్డులు త్వరలోనే ప్రకటించనున్నాయి.

చైతన్య రథం
సినిమా
ఆదివారం 15 నవంబరు 2026

ఎన్టీఆర్‌తో అనిల్ రావిపూడి సినిమా




టాలీవుడ్ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న కాంబినేషన్ ఖరారయింది. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ – బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కలయికలో ఒక చిత్రం రాబోతోంది. ఎన్టీఆర్ గత కొంతకాలంగా యాక్షన్ సినిమాలతోనే ప్రేక్షకుల ముందకు వస్తున్నాడు. దేవర, వార్ 2.. ఇప్పుడు రాబోతున్న డ్రాగన్ కూడా ఫుల్ యాక్షన్ సినిమానే. ఇక దీని తరువాత గాడ్ ఆఫ్ వార్ మొత్తం డివైన్ మోడ్ లోనే ఉంటుంది. దీంతో నందమూరి ఫ్యాన్స్ అందరూ తారక్ నుంచి మంచి ఎంటర్‌టైనర్ కోరుకుంటున్నారు. కామెడీ పండించడంలో ఎన్టీఆర్ టైమింగ్ ని ఎవరూ కొట్టలేరు. మరోపక్క ఇటీవలి కాలంలో కామెడీ సూపర్ హిట్లకు కేరాఫ్ అడ్రెస్‌గా మారాడు దర్శకుడు అనిల్ రావిపూడి. ఇప్పుడు ఎన్టీఆర్, అనిల్ కాంబినేషన్ ఖరారయిందనే వార్త బయటకు రావటంతో అభిమానుల ఆనందానికి హద్దుల్లేకుండా ఉన్నాయి.

ఎన్టీఆర్ హీరోగా, అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఒక భారీ సినిమాను అధికారికంగా ప్రకటించారు. నందమూరి కల్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ ప్రతిష్టాత్మక చిత్రం అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కనుంది. ఎన్టీఆర్ మాస్ ఇమేజ్, అనిల్ రావిపూడి స్టయిల్ ఎంటర్‌టైన్‌మెంట్ అండ్ కమర్షియల్ ఎలిమెంట్స్ కలగలిపి ఈ సినిమాను రూపొందించనున్నారు. ఇప్పటివరకు ఎన్టీఆర్ చేయని సరికొత్త జోనర్‌లో ఈ చిత్రం ఉండబోతున్నట్లు తెలుస్తోంది. అనిల్ రావిపూడి తనదైన శైలిలో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తూనే, మరోవైపు ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కు గూస్‌బంప్స్ తెప్పించే యాక్షన్ సీక్వెన్స్‌లను ఈ చిత్రంలో డిజైన్ చేస్తున్నట్లు సమాచారం.

ఈ సినిమాకు సంబంధించి మరో క్రేజీ అప్‌డేట్ ఏమిటంటే.. ఈ చిత్రాన్ని బాక్సాఫీస్ టార్గెట్‌గా సంక్రాంతి 2028 కానుకగా విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. సంక్రాంతి బరిలో ఎన్టీఆర్, అనిల్ రావిపూడి కాంబో సినిమా వస్తోందంటే అంచనాలు ఏ స్థాయిలో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచింది. ప్రస్తుతం ప్రశాంత్ నీల్ డ్రాగన్ సినిమాతో ఎన్టీఆర్ బిజీగా ఉన్నాడు. ఆ సినిమా పూర్తయిన తర్వాత అనిల్‌తో మూవీ పట్టాలెక్కే అవకాశం ఉంది. ఇంకోపక్క వెంకటేష్, కళ్యాణ్ రామ్ మల్టీస్టారర్ గా అనిల్ తెరకెక్కిస్తున్న 'జనవరి 12 విడుదల' సినిమా 2027 సంక్రాంతి కానుకగా రానుంది.

ఓటీటీలో తెలుగులోనూ 'అబ్సెషన్'

ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సినిమాల్లో 'అబ్సెషన్' ఒకటి. ఈ హాలీవుడ్ థ్రిల్లర్ మూవీని ఓ యూట్యూబర్ తెరకెక్కించారు. కేవలం రూ.7కోట్ల బడ్జెట్ పెడితే ఏకంగా రూ.1600కోట్ల కలెక్షన్ సాధించింది. మొదట అమెరికాలో మాత్రమే రిలీజైన ఈ చిత్రం.. ఆ తర్వాత మన దేశంలోనూ విడుదలై బాక్సాఫీస్ వద్ద ఫర్వాలేద నిపించింది. ప్రస్తుతం ఈ మూవీ ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చేసింది. అయితే మొదట కేవలం ఇంగ్లీష్, హిందీలో మాత్రమే అందుబాటులోకి రావటంతో దక్షిణాది ప్రేక్షకులు నిరాశకు గురయ్యారు. తాజాగా జియో హాట్ స్టార్ దక్షిణాది భాషల్లోనూ అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ భాషల్లోనూ స్ట్రీమింగ్ అవుతోంది. అంతేకాకుండా అన్ కట్ వర్షన్ ఓటీటీలోకి తీసుకొచ్చారు. ఈ చిత్రంలో మైఖేల్ జాన్సన్, ఇండే నవారెట్లు ప్రధాన పాత్రల్లో నటించగా.. కరీ బార్కర్ దర్శకత్వం వహించారు.



సీనియర్ నటుడు గిరిబాబు కన్నుమూత



తెలుగు సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. హీరోగా, విలన్‌గా, కేరెక్టర్ యాక్టర్‌గా, కమెడియన్‌గా వందలాది చిత్రాల్లో విలక్షణమైన పాత్రలు పోషించిన సీనియర్ నటుడు గిరిబాబు (80) మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుది శ్వాస విడిచారు. ఆయన మరణవార్తతో ఇండస్ట్రీలో తీవ్ర విషాద ఛాయలు నెలకొన్నాయి. గిరిబాబు సతీమణి 2016లో అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు రఘుబాబు, బోసుబాబు ఇద్దరు కుమారులు. రఘుబాబు హాస్యనటుడిగా కొనసాగుతున్నారు. 2023లో విడుదలైన 'అన్నీ మంచి శకునములే' గిరిబాబు నటించిన చివరి చిత్రం.

1946 జూన్ 8న ప్రకాశం జిల్లా కొరిశపాడు మండలం రావినూతల గ్రామంలో జన్మించిన ఆయన 'జగమే 'మాయ' చిత్రంతో సినీ పరిశ్రమకు పరిచయమయిన గిరిబాబు వందలాది చిత్రాల్లో తనదైన అభినయంతో ఆకట్టుకున్నారు. ఆయన అసలు పేరు యర్రా శేషగిరిరావు. గిరిబాబుకు చదువుకొనే రోజుల నుంచే నటనాభిలాష ఉండేది. ఎన్టీఆర్, ఏఎన్నార్ చిత్రాలు చూసి వారిలాగా అభినయిస్తూండేవారు. తరువాత నాటకాల్లో నటించారు. అదే ఆసక్తితో చిత్రసీమలోనూ ప్రవేశించారు. మొదటి సినిమా 'ధైర్యే సాహసే లక్ష్మి' మొదలైనా పూర్తి కాలేదు. ఆ తర్వాత 'తప్పటడుగులు' ఓకే అయినా అదీ ఆగిపోయింది. మూడో సినిమా 'స్వర్గానికి నిచ్చెనలు' ఆరు రీళ్లు తీశాక ఆపేశారు. మొదటి మూడు సినిమాలు ఆగిపోయినా.. 1973లో రూపొందిన 'జగమే మాయ' చిత్రం ద్వారా హీరోగా ఫస్ట్ టైమ్ స్క్రీన్ మీద కనిపించారు.. తరువాత 'వధూవరులు' వంటి కొన్ని సినిమాల్లో హీరోగానూ నటించారు. అయితే కథానాయకునిగా గిరిబాబు సక్సెస్ సాధించలేదు. దాంతో విలన్ వేషాల్లో రాణిస్తూ ముందుకు సాగారు. గిరిబాబు తొలుత విలన్ వేషాలు వేసి జనాన్ని భయపెట్టినా, తరువాతి రోజుల్లో కేరెక్టర్ రోల్స్‌లో ప్రేక్షకులకు దగ్గరయ్యారు. కమెడియన్‌గా, కామెడీ విలన్‌గానూ అలరించారు.

గిరిబాబు నటునిగానే కాదు జయభేరి పతాకంపై నిర్మాతగా, రచయితగా, దర్శకునిగానూ రాణించారు. స్వయంగా నటిస్తూ 'దేవతలారా దీవించండి, సింహగర్జన, మెరుపుదాడి వంటి హిట్ చిత్రాలను నిర్మించారు. 'రణరంగం', 'ఇంద్రజిత్' 'నీ సుఖమే నే కోరుకున్నా' వంటి చిత్రాలకు దర్శకత్వం వహించారు. గిరిబాబు, మురళీమోహన్ మంచి మిత్రులు... ఇద్దరూ 'జగమేమాయ'తోనే చిత్రసీమకుపరిచయమయ్యారు. గిరిబాబు నెలకొల్పిన జయభేరి బ్యానర్‌ను తరువాత మురళీమోహన్ తీసుకున్నారు. అప్పటి నుంచీ మురళీమోహన్ సొంత చిత్రాల్లో గిరిబాబు తప్పనిసరిగా కనిపించే వారు. సదరు చిత్రాల్లో మురళీమోహన్ నటించ కున్నా, గిరిబాబు తప్పకుండా ఉండేవారు. చిత్రసీమలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు గిరిబాబు.

తెలుగు సినీ పరిశ్రమలో సుదీర్ఘ కెరీర్‌ను కొనసాగించిన నటుల్లో గిరిబాబు ఒకరు. రంగస్థలం నుంచి నట ప్రస్థానం ప్రారంభించిన ఆయన.. సినీ జీవితంలో పరిపూర్ణత సాధించారు. 'జగమే మాయ' తర్వాత 'జ్యోతి', 'మా దైవం', 'కురు క్షేత్రం', 'దేవతలారా దీవించండి' తదితర చిత్రాలు తొలినాళ్లలో ఆయనకు మంచి పేరు తెచ్చి పెట్టాయి. పాత్ర నిడివితో సంబంధం లేకుండా తన నటనతో అల రించేవారు. కొడుకుగా, తండ్రిగా, ఊరి పెద్దగా, ఇంటి పెద్దగా ఆయన ఎన్నో మరిచిపోలేని పాత్రలు చేశారు. 'మిస్టర్ అండ్ మిసెస్ శైలజా కృష్ణమూర్తి', 'భైరవ ద్వీపం','అల్లుడా మజాకా','ప్రేమ లేఖలు', 'హలో బ్రదర్', 'సిసింద్రీ', ప్రతినిధి, 'కితకితలు', 'ఎవడైతే నాకేంటి', 'అతడు', 'నువ్వేకావాలి', 'బిందాస్', 'అ.. ఆ', 'గీత గోవిందం', 'శ్రీకారం' వంటి 600లకు పైగా చిత్రాల్లో నటించి మెప్పించారు.



'జార్జి క్రిష్' డబ్బింగ్ మొదలు

చార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా శ్రీను వైట్ల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'జార్జ్ క్రిష్' మూవీ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ శరవేగం గా సాగుతోంది. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యాన ర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఏటీవీ సమ ర్పిస్తుండగా, అజయ్ సుంకర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. పూర్తిస్తాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం లో శర్వా సరసన మానస వారణాసి కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే విడుదలైన 'జార్జ్ క్రిష్' ఫస్ట్ బూస్టర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇందులో శర్వానంద్‌ను రెండు విభిన్న మతాలకు చెంది న పాత్రల్లో పరిచయం చేశారు. క్రిస్టియన్‌గా జార్జ్, హిందువుగా క్రిష్ పాత్రల్లో శర్వా అలరించారు. పూర్తిగా భిన్నమైన పరిస్థితుల్లో ఈ రెండు పాత్రలను చూపిస్తూ క్యూరియాసిటీ పెంచారు. తాజాగా సినిమా డబ్బింగ్ కార్యక్రమాలు పూజా కార్యక్రమాలతో ప్రారంభమయ్యాయి.

ఈ కార్యక్రమంలో దర్శకుడు శ్రీనువైట్ల, హీరోయిన్ మానస వారణాసి పాల్గొన్నారు. డబ్బింగ్ ప్రారంభమైన సందర్భంగా హీరోయిన్ మానస వారణాసి తనపాత్రకు స్వయం గా డబ్బింగ్ చెబుతున్నవీడియో ఆకట్టుకుంది.ఈచిత్రానికి అనూప్ రూబెన్స్ మ్యూజిక్ అందిస్తున్నారు, కేవీ గుహన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా,అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్.అమర్‌రెడ్డి కుడు ముల ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. నందు సవిరిగాన,గోపీ మోహన్ రచయితలుగా వ్యవహరిస్తుండగా, కిషోర్ గరికిపాటి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా ఉన్నారు.'జార్జ్ క్రిష్' చిత్రాన్ని సంక్రాంతి కానుకగా 2027 జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయనున్నారు. ఈ సంక్రాంతికి ప్రేక్షకులకు హ్యూమర్, రొమాన్స్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కూడిన వినోదాల విందు అందించేందుకు 'జార్జ్ క్రిష్' సిద్ధమౌతోంది.

ఆర్గనైజ్డ్ క్రైమ్ నెట్‌వర్క్ నేపథ్యంలో 'ఓం'!

టాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా వరుస క్రేజీ ప్రాజెక్ట్స్ తో దూసుకుపోతున్న టాలెంటెడ్ హీరో ధనుష్ నటించిన తాజా చిత్రం 'ఓం'. 'అమరన్' దర్శకుడు రాజ్‌కుమార్ పెరిసామి దర్శ కత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్,వండర్ బార్‌ఫిలింస్ సంయు క్తంగా ఈభారీ బడ్జెట్‌చిత్రాన్ని నిర్మించాయి.ఇక ఈచిత్రంలో మల యాళ మెగాస్టార్ మమ్ముట్టి, సాయిపల్లవి, శ్రీలీల, రేణు దేశాయ్ లాంటి స్టార్స్ కీలకపాత్రల్లో కనిపించనున్నారు. ఇప్పటికే ఓం సిని మా నుంచి రిలీజైన పోస్టర్స్,టీజర్, సాంగ్స్ ప్రేక్షకులనువిశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంటోంది.ఈ ట్రైలర్ ను పరిశీలిస్తే.. ఎర్రచందనం స్మగ్లింగ్.. ఒక ఆర్గనైజ్డ్ క్రైమ్ నెట్‌వర్క్ నేపథ్యంలో ఈకథ సాగుతున్నట్లు స్పష్టమవుతోంది. 'ఇది ఎలాంటి నేరం అంటే..నేచర్‌పై జరిగే క్రైమ్..' అనే డైలాగ్‌తో మొదలయిన ట్రైలర్‌లో యాక్షన్ సన్నివేశాలను నింపేశారు. ధనుష్.. ఆర్గనైజ్డ్ క్రైమ్ నెట్‌వర్క్‌ను ఛేదించే పోలీస్ ఆఫీసర్‌గా కనిపించగా.. సాయి పల్లవి నిత్యారెడ్డి అనే పోలీస్ ఆఫీసర్‌గా కనిపించింది. 'నేను ఈ ఆపరేషన్‌ను రన్ చేస్తున్నాను..దీని పేరు ఆపరే షన్ మోల్.. అంటే ఓం అని చెప్పే సన్నివేశాలు సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చాయి. మరోవైపు ధనుష్, మమ్ముట్టి స్క్రీన్ ప్రెజెన్స్, వారి మధ్య వచ్చే యాక్షన్ సీక్వెన్స్‌లు గూస్‌బంప్స్ తెప్పిస్తున్నాయి. ఇక ఈ సినిమా ఆంధ్రా– తెలం గాణ బోర్డర్‌మధ్యలో ఎర్రచందనం స్మగ్లింగ్ చేసే ఒక స్మగ్లర్ కి, పోలీసులకు మధ్య సాగే ఒక యుద్ధంలా కనిపి స్తోంది.పోలీస్ అయిన హీరో.. గ్యాంగ్‌స్టర్ గ్యాంగ్‌లో చేరి, ఆ ఇన్ఫ ర్మేషన్ మొత్తం పోలీసులకు అంద జేస్తున్నట్లు కనిపిస్తోంది. ఓం ట్రైలర్ తో హైప్ పెంచేశారు మేకర్స్. ఈసినిమా నవంబర్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది.

